నా మదిలో మెరిసిన

హరివిల్లు

కవితా సంపుటి

- కందుల నాగేశ్వరరావు

నా మదిలో మెరిసిన హరివిల్లు

(కవితా సంపుటి)

NAA MADILO MERISINA HARIVILLU

By

KANDULA NAGESWARA RAO

CHAMPAPET
HYDERABAD- 500079

email: nagraokandula48@gmail.com

(M) +91 77806 85166

Revised PDF edition:

26 OCTOBER 2022

Publishers: *Aparna & Praveena*

నా మదిలో మెరిసిన హరివిల్లు

కవితా సంపుటి

రచయిత

కందుల నాగేశ్వరరావు

M. Sc (Tech), ADM, FIETE

ప్రకాశిక

ఆధునిక తెలుగు సాహిత్యంలో "కవితా ప్రక్రియ" మంచి ప్రాచుర్యం పొందింది. అవి వచన కవితలుగా, గేయ కవితలుగా, మినీ కవితలుగా రూపం దిద్దుకొని సామాజిక మాధ్యమాలలో పాఠకులను ఆకట్టుకుంటున్నాయి. ఒక వ్యక్తి దేశకాలమాన పరిస్థితులనుబట్టి తన మనస్సులో చెలరేగే భావాలను సున్నితంగా సరళమైన వ్యవహారభాషలో వ్యక్తపరచడానికి ఈ కవితా ప్రక్రియ దోహదం చేస్తోంది.

మా తండ్రిగారైన శ్రీ కందుల నాగేశ్వరరావు గారు పదవీ విరమణ చేసాక, హైదరాబాదులో విశ్రాంత జీవితం గడుపుతూ రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. గత రెండు సంవత్సరాలుగా సాంఘిక మాధ్యమాలలో ప్రచురణ అయిన మా నాన్నగారి కవితలను సేకరించి "నా మదిలో మెరిసిన హరివిల్లు" అనే ఈ కవితా సంపుటిని ప్రచిస్తున్నాము. ఇది మా నాన్నగారికి మేము ఇచ్చే చిరుకానుక. ఈ కవితా సంపుటిని పాఠకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాము.

కుమార్తెలు

తే॥ 05-10-2022

అపర్ణ & ప్రవీణ

ప్రకాశకులు

తొలి పలుకు

మనిషి మస్తిష్కంలో ఎప్పుడూ ఏవో భావాలు ఆకాశంలోని మేఘాలవలె కదలాడుతూ ఉంటాయి. అందులో కొన్నిటిని మాత్రమే మన బుద్ధి గ్రహించి, పట్టి, దాచి, వాటి గురించి ఆలోచన చేస్తుంది. మిగతావి ఆషాఢమాసపు మేఘాలవలె వచ్చినవి వచ్చినట్టే మన మీద ఏ ప్రభావం చూపకుండా వెళ్ళిపోతాయి.

మనదేశంలోకి 2020లో ప్రవేశించిన కోవిడ్-19 వైరస్ అంతకు ముందు మనకి తెలియని, మనం చూడని పరిస్థితులను, మన ముందుకు తీసుకు వచ్చింది. పిల్లల దగ్గర నుండి వృద్ధుల వరకూ అందరూ ఇంటికి బందీ అయ్యారు. అన్ని రకాల సమస్యలతోబాటు మనలో మనకి తెలియకుండా దాగిఉన్న కొన్ని అభిరుచులను, ఇష్టాలను మనం ప్రవృత్తిగా మార్చుకునే అవకాశం తీసుకు వచ్చింది. గత రెండు సంవత్సరాలలో నా మనస్సుకు తట్టిన కొన్ని భావాలను గేయ కవితలుగా రాసి సాంఘిక సముదాయాలలో పోస్టు చేసాను.

వివిధ అంశాలతో అల్లిన **"నా మదిలో మెరిసిన హరివిల్లు"** అనే ఈ కవితా సంపుటిలో చిన్నా పెద్దా కలిసి ఒక వంద పైగా కవితలు ఉన్నాయి. వాటిని ఈ-బుక్ రూపంలో మీ ముందుకు తీసుకువస్తున్నాను. ఇంద్ర ధనుస్సు లోని సప్త వర్ణాల వలె, వాటి ఇతివృత్తాన్ని బట్టి కవితలను భక్తి-శక్తి; సంసారం-జీవితం; ప్రేమ-

ప్రణయం; హాస్యం-వినోదం; మనిషి-వ్యక్తిత్వం; తత్త్వం-వేదాంతం; సమాజం-ప్రపంచం - అనే ఏడు భాగాలుగా విభజించడం జరిగింది.

"భక్తి - శక్తి" అనే మొదటి **భాగంలో 'దైవభక్తి అనంత శక్తి', 'మంచి చేయాలంటే', 'ఎక్కడ ఉన్నాడు పరమాత్మ'** అనే కవితలు మనిషికి భక్తి ఉండాలి కాని చాదస్తం అనేది ఉండకూడదు. దైవాన్ని మన సమస్యలు తీర్చమని కోరడం కంటె మన సమస్యలను మనమే పరిష్కరించగల శక్తిని ఇవ్వమని కోరుకోవాలి, దైవం ఎప్పుడూ మన చుట్టూ ఉండే మనుష్యుల రూపంలోనే మనకు సాయం చేస్తాడు. అది మన బంధువులైనా, మిత్రులైనా లేక సమాజంలో సేవ చేసే వారెవరైనా సరే. పరమాత్మ విశ్వం అంతటా వెదికినా కనపడడు ఆయన మన హృదయంలోనే దాగి ఉంటాడు అనే భావంతో వ్రాసాను.

"సంసారం-జీవితం" అనే రెండవ భాగంలో **'సంసారం జీవన గమనం' 'అమ్మాయి పుట్టింది'** అనే కవితలలో జీవితంలో భార్యాభర్తలు చేయి చేయి కలిపి కష్టాలైనా సుఖాలైనా జీవనగమనం సాగించాలనీ, అమ్మాయి రెండు కుటుంబాలకు వారధి, పుట్టినింటి గౌరవాన్ని నిలబెడుతూ మెట్టినింటి భవితవ్యాన్ని తీర్చిదిద్దగల ఓర్పు నేర్పు ఆమెకు ఉంటాయి అనే భావం వ్యక్త పరిచాను.

"ప్రేమ - ప్రణయం" అనే మూడవ భాగంలో **"ఇల్లాలి అలుక, ప్రేయసి కినుక"** అనే కవితల్లో భార్యాభర్తల మధ్యగాని ప్రేమికుల మధ్యగాని, ఉండే సరదా అలుకలు, వాటిని పోగొట్టడానికి చేసే ప్రయత్నాలు ఉన్నాయి.

"హాస్యం- వినోదం" అనే నాల్గవ భాగంలో 'పాఠాలు నేర్పిన దోమలు' లో దోమల వల్ల వచ్చే బెడద, **"వ్యంగ్య కవితలు, సలహా"** అనే కవితలు చదివి గురజాడ అప్పారావు గారి గిరీశాన్ని గుర్తుకు తెచ్చుకుని కాస్సేపు నవ్వుకుంటారని ఆశిస్తాను.

"మనిషి - వ్యక్తిత్వం" అనే అయిదవ భాగంలో ఆధునిక సమాజంలో మనిషిలో పేరుకుపోతున్న 'స్వార్థం', 'అహం', 'అసూయ' లాంటి రుగ్మతలుపై కవితలు ఉన్నాయి.

"తత్త్వం - వేదాంతం" అనే ఆరవ భాగంలో కాలం మనకోసం ఆగదు, కాలంతోబాటే పగలు రాత్రులు, సుఖదుఃఖాలు మారుతూ ఉంటాయి. మనం కాలంతోబాటే ప్రయాణం చెయ్యాల్సిందే కాని కాలానికి ఎదురు ఈదలేం అనేది **"తిరుగుతుంది భూగోళం"** కవితలోని ఇతివృత్తం. మనం జీవితంలోని కష్టాలు సుఖాలు అనుభవిస్తూ, అందులోని ఆనందం ఆస్వాదిస్తూ మన బాధ్యతలు తప్పక నెరవేరుస్తూ ఈ జీవిత నాటకరంగంలో ఆ దైవం మనకి నిర్ణయించిన పాత్రలకు పూర్తి

న్యాయం చేస్తూ పోషించాలనే భావాన్ని “**నాటకం జగన్నాటకం**’ తెలియపరుస్తుంది.

చివరిగా “సమాజం - ప్రపంచం” అనే శీర్షికతో ఉన్న ఏడవ భాగంలో ప్రస్తుత కాలంలో సమాజంలో వచ్చే సమస్యలు; అది కరోనా లాంటి విపత్కర పరిస్థితి, దేశానికి వెన్నెముక లాంటి రైతుల దీనస్థితి, స్వాతంత్ర్య సమరయోధుల నిస్వార్థ త్యాగాలు, ప్రజాస్వామ్యంలో ప్రజల బాధ్యతలు, ప్రపంచంలో జరుగుతున్న అగ్రరాజ్యాల ఆధిపత్య పోరు లాంటి విషయాలపై కవితలు ఉన్నాయి. రసజ్ఞులు, తెలుగు భాషాభిమానులు ఈ కవితలను చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

హైదరాబాద్ **కందుల నాగేశ్వరరావు**
05-10-2022 **రచయిత**

స్పందన – అభినందన

నిజం చెప్పాలంటే 'నా మదిలో మెరిసిన హరివిల్లు' అనే శీర్షికతో సంకలనం చేయబడ్డ కవితా సంపుటిలోని కవితలను కందుల నాగేశ్వరరావుగారు విడివిడిగా, వ్రాసిన వెంటనే సామాజిక మాధ్యమములో పంచుకున్నప్పుడు, నేను ఎప్పటికప్పుడే చదివేశాను.

సందర్భాన్ని బట్టి, సందర్భానుసారంగా, సందర్భ స్ఫూర్తిగా వారు వ్రాసే కవితలు వాటి నిడివితో సంబంధము లేకుండా ఆ సందర్భాన్ని చక్కని ఇన్ స్టెంట్ కాఫీ లాగా అలరించేవని చెప్పటం అతిశయోక్తి అనిపించు కోదు. ఆ కవితలలో వారు ఒలికించిన ఒకింత హాస్యము, శృంగార భక్తి రసాలు, భావ గంభీరత సరళత్వము, ఆధ్యాత్మికత, ఔచిత్యము, సామాజిక స్పృహ విశేషించి వారు పాటించిన సందర్భశుద్ధి అలాంటివి మరి. హరివిల్లులోని సప్తవర్ణాలవలె నాగేశ్వరరావు గారు ఈ కవితా సంపుటిని భక్తి, జీవితం, ప్రణయం, హాస్యం, మానవ వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక తత్త్వం, సమాజం అనే ఏడు భాగాలుగా విభజించి వారి కవితలలోని భావ వైవిధ్యాన్ని మనకు తెలియజేసారు.

అయితే ఈ కవితలన్నీ ఒకేచోట సంకలితమై వాటిని ఒక పుస్తక రూపములో చదివే వారికి, వారితో గత పరిచయము, సాహచర్యము లేని పాఠకులకు కూడా నాగేశ్వరరావు గారి పరిపూర్ణ వ్యక్తిత్వము అవగతమవుతుంది.

కందుల నాగేశ్వరరావు గారి "నా మదిలో హరివిల్లు" అనే ఇంత గొప్ప కవితా సంపుటిని మన కందించినందుకు వారిని మనసారా అభినందిస్తూ, అయితే ఇది వారి కవితా ఝరి నుంచి మనకందించిన తొలి బిందె మాత్రమే ననీ, ఇది వారి పాఠక కుటుంబము యొక్క దాహార్తిని పూర్తిగా తీర్చలేదనీ గ్రహించి, వారి కవితా వ్యాసంగాన్ని వారు ఇలాగే కొనసాగిస్తూ, మరిన్ని కవితలని, కవితాసంకలనాల్ని పాఠకులకందించేలా వారికి దీర్ఘాయురారోగ్యాలను ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

హైదరాబాదు — **వోలుదాసు నరసింహ రావు**

ది.02.10.2022 — **విశ్రాంత శాస్త్రవేత్త (రక్షణ శాఖ)**

విషయ సూచిక

కవితలు		పుటసంఖ్య
1. భక్తి - శక్తి	....	01
2. సంసారం - జీవితం	...	19
3. ప్రేమ - ప్రణయం	...	34
4. హాస్యం - వినోదం	...	43
5. మనిషి - వ్యక్తిత్వం	...	56
6. తత్త్వం - వేదాంతం	....	75
7. సమాజం - ప్రపంచం	....	92

***

1

భక్తి - శక్తి

వందనం

వందనమమ్మా జగన్మాతా నీకు వందనం
నాలో ప్రాణం నింపినందుకు
నన్ను మనిషిగా పుట్టించినందుకు
వందనమమ్మా నీకు వందనం

వందనమమ్మా మాతా నీకు వందనం
నాకు జన్మను ఇచ్చినందుకు
నన్ను పాలు ఇచ్చి పెంచినందుకు
వందనమమ్మా నీకు వందనం

వందనమమ్మా భూమాతా నీకు వందనం
నాకు నీ ఒడిలో చోటు ఇచ్చినందుకు
నా గమనానికి మూలాధారం అయినందుకు
వందనమమ్మా నీకు వందనం

***

దైవభక్తి - అనంత శక్తి

విశ్వము దైవము   ప్రకృతి దైవము
జీవకోటిలోని జీవము దైవము
నీవు వేరు దైవము వేరు కాదురా
నువ్వు కూడా పరమాత్మలో భాగమేరా
భగవంతుడు ఒక్కడే రూపాలు వేరులే
నీకు నచ్చిన రూపాన్ని నీమదిలో నిలుపు
భక్తి తోటి చేయి నువ్వు అలంకారం
భక్తి తోటి పెట్టు నువ్వు నైవేద్యం
అలంకారం నీకంటికి నైవేద్యం నీ నోటికి
భక్తి మాత్రమే భగవంతునికి
భక్తి లేని పూజలన్నీ నీరులేని బావులే
వదిలి పెట్టు దేవుడంటే భయం
మనసు పెట్టి దైవాన్ని పూజించు
భగవంతుని ప్రార్థించు శక్తి కావాలని కోరు
నీ బుద్ధిని పదును పెట్టే శక్తి
నీ సమస్యలు పరిష్కరించే శక్తి
పనిలో ప్రావీణ్యత సంపాదించే శక్తి
జీవనాన్ని పరిపూర్ణం చేసే శక్తి

బంధాలను త్రెంచుకొనే శక్తి
ముక్తికి మార్గం చూపే శక్తి
గాలిలోన శక్తి   నీటిలోన శక్తి
సూర్యరశ్మిలోని శక్తి ప్రకృతిలో ఉన్న శక్తి
జీవుల్లో ఉన్నట్టి జీవశక్తి
పరమాత్మలోని అనంత శక్తి
అణువణువున ఉన్న అఖండ శక్తి
ఒక్క అణువులో అంత శక్తి ఉంటే
బ్రహ్మాండం పరిమాణం ఎంత!
బ్రహ్మాండంలో దాగిన శక్తి ఎంత!
శక్తి లేని శివుడు పిచ్చోడై తిరగలేదా!
సిరి వదలిన విష్ణువు పుట్టలో దూరలేదా!
వాణి లేక బ్రహ్మ వేదాలు చెప్పగలడా!
ముగ్గురు అమ్మలు త్రిమూర్తులకు శక్తి కాదా!
ఈ అనంత విశ్వ సృష్టికర్త శక్తి ఎంత!
ఆ అనంతశయనుడు విష్ణుమూర్తి శక్తి ఎంత!
విశ్వేశ్వరుడు విశ్వనాథుడి శక్తి ఎంత!
అన్నిటికి మూలమైన ఆ జగన్మాత శక్తి ఎంత!

***

ఓంకారం – ప్రణవ నాదం

ఓంకారం సర్వ శక్తిమయం
ఓంకారంపరమాత్మకు ప్రతిబింబం
ఓంకారం శూన్యం నుండి ఆవిర్భావం
ఓంకారంతో శూన్యంలో ప్రకంపనం
ప్రకంపనలతో శూన్యం లో చైతన్యం
చైతన్యంతో వ్యక్తం సృష్టి సర్వస్వం
ఓంకార నాదం వేదాలకు మూలం
ఓంకారం నాలుగు వేదాల సారం
ఓంకార జనితం వేద మంత్రం
ఓంకార నాదం ప్రణవ స్వరూపం
శక్తికి తొలి వ్యక్త రూపం శబ్దం
పంచభూతాలకు ప్రథమ లక్షణం శబ్దం
ఓంకారం ఆ శబ్దానికి ఆధారం
ఓంకారం సర్వదా శ్రవణానందం
ఓంకారం 'అ ఉ మ్' ల సమ్మేళనం
ఓంకారం మూల బీజం
విశ్వ ప్రకటిత సమయం

ఓంకార స్వర జననం
ఓంకారం విశ్వ మంతా వ్యాప్తం
ఓంకార తరంగంతో దేహం పులకితం
ఓంకారం మానవ ఆరోగ్య రహస్యానికిసూత్రం
ఓంకార స్మరణం మృత్యుంజయ జపం
ఓంకారం ఏకైక సమగ్ర రూపం
ఓం ముఖ్య ఆధ్యాత్మిక చిహ్నం
ఓంకారం ధ్యానానికి సాధనం
ఓంకారం జ్ఞానానికి లక్షణం
ఓంకారం సర్వ దేవాత్మకం
ఓంకార స్మరణం మోక్షగ్రహణం
ఓంకారంతో పంచాక్షరి "ఓం నమః శివాయ"
ఓంకారంతో గాయత్రి "ఓం భూర్ భువ స్వాహ్"
ఓంకార ధ్యానంతో ప్రాప్తం బ్రహ్మజ్ఞానం
ఓంకారం జ్ఞానరూపంలోని చైతన్యం
ఓంకారానికి లక్షణం సత్య స్వభావం
ఓంకారానికి పరమావధి పరమానందం
ఓంకారం అక్షరం త్రిమూర్తాత్మకం
ఓంకారం సృష్టి స్తితి లయలకు సంకేతం

***

ఎక్కడ ఉన్నాడు పరమాత్మ?

మనిషి ఆత్మ బయటకొచ్చి,
సముద్రాలు శోధించి

భూమి చుట్టూ తిరిగి తిరిగి,
నింగిలోకి దూసి కెళ్ళి

మేఘాలను ముట్టుకొని,
దివి వైపు పయనించి

అంతరిక్షంలో ఆడుకొని,
పాలపుంత కూడ దాటి

విశ్వమంతా వెదికినా,
కానరాలేదు పరమాత్మ ఎక్కడా!

విశ్వమంతా నిండిన వాడు,
అణువణువున ఉన్నవాడు!

జగములన్ని తనలో దాచుకున్నవాడు,
జగమున ఎక్కడ దాగి ఉన్నాడో!

జగధీశ్వరుడు, జగన్నాథుడు!
జగన్మోహనుడు, జనార్ధనుడు!

పరమాత్మ, పరమేశ్వరుడు!
పరంజ్యోతి, పురుషోత్తముడు!

సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు!
సర్వాత్మకుడు, సర్వోన్నతుడు!

అంతర్యామి, అజుడు!
ఆదిమధ్యాంతరహితుడు!

విశ్వాత్మ, విశ్వమయుడు, విష్ణుమూర్తి!
విశ్వేశుడు, విశ్వేశ్వరుడు, విశ్వనాథుడు!

నిరాకారుడు, నిర్గుణుడు,
నిరంజనుడు! నీలో ఎందుకు లేడు?

నీ మనస్సుతో వెదికి చూడు,
నీ గుండె లోతుల్లోనే ఉంటాడు వాడు.

***

మంచి చేయాలంటే

మంచి చేయాలంటే
మనిషిగా పుట్టాల్సిందే - దేవుడైనా సరే
త్రేతాయుగంలో శ్రీరాముడుగా
ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడుగా
మనిషిగానే పుట్టాడు ఈలోకంలో
మంచి చేయడానికి ఒక్కొక్క కాలంలో
కలియుగంలో కనిపెట్టాడో కొత్త విధానం
దైవత్వంలో అణువంత ప్రమాణం
చొప్పించాడు కొందరి హృదయాల్లో
పుట్టించాడు వారిని ఈ భూలోకంలో
పెంచి పోషించే తల్లి తండ్రులుగా
విద్యాబోధన చేసే గురువులుగా
అనురాగాన్ని పంచే సహోదరులుగా
మనలను ప్రేమించే పిల్లలుగా
ఆప్యాయతను ఇచ్చే స్నేహితులుగా
దేవుడే పుడతాడు ఈభూమి పైన
న్యాయాన్ని నిలపాలన్నా
అన్యాయాన్ని ఎదుర్కోవాలన్నా
మంచిని పెంచాలన్నా
చెడును తుంచాలన్నా

ధర్మాన్ని స్థాపించాలన్నా
అధర్మాన్ని అరికట్టాలన్నా
సన్మార్గుల్ని రక్షించాలన్నా
దుర్మార్గుల్ని శిక్షించాలన్నా
మనిషిగా పుట్టాల్సిందే
ఆ దేవుడు అయినా సరే
కర్షకుడైనా కార్మికుడైనా
శ్రామికుడైనా సైనికుడైనా
పాలకుడైనా రక్షక భటుడైనా
గాయకుడైనా నాయకుడైనా
వైద్యుడైనా,   వైజ్ఞానికుడైనా
నిజాయితీతో విధి నిర్వహించి
సమాజానికి సాయపడే వారెవరైనా
ఈ భూమి పైనున్న దేవుళ్ళే
దేవుడంత ఎత్తు ఎదిగిన
మామూలు మనుష్యులే

***

విష్ణు స్తోత్రం

విష్ణు స్తోత్రం సంసార బాధలకు ఔషధం
చెవులకు మనస్సుకు ఆనంద దాయకం
మోక్షం కోరేవారికి మేలైన సులభ మార్గం
నచ్చని మూర్ఖులకు నరకానికి సోపానం

***

మా ఊరు

మా ఊరి మధ్యలో ఉందో శివాలయం
దాని చుట్టూ పాడు పడ్డ ప్రాకారం
ప్రాంగణమంతా గన్నేరు చెట్లమయం
సాయంత్రం అది పిల్లలకు ఆటస్థలం

***

నమః శివాయ

ఎంత గొప్ప వాడవయ్య శివయ్య నువ్వు
గౌరమ్మ కు నీలో సగభాగం ఇచ్చావు
గంగమ్మను నీ నెత్తిమీద పెట్టుకున్నావు
ఇంక ఎవరిచ్చారు స్త్రీ కి ఇంతటి గౌరవం

***

రాసక్రీడ

రాధాకృష్ణుల రాసక్రీడలు
రసమయ సృష్టి విశేషాలు
గోపాలుని మాయలో మునులందరు
గోపికలై నాట్యం చేసిన మధుర క్షణాలు

***

రస సృష్టి

అఖిల జీవములయందు, తన విశ్వమాయచే
అజుడు, ఆడ మగయను భేదమును గల్పించె
అన్ని పునరుత్పత్తి సాధనములను సమకూర్చె
ఆకర్షణయను ఆయుధమునిచ్చి జీవవృద్ధిని గావించె

***

శ్రీకృష్ణ లీలలు

1. ముసి ముసి నవ్వులతో చిట్టి చిట్టి పాదాలతో
   చిన్ని చిన్ని అడుగులేస్తూ
   కాలి గజ్జెల సవ్వడితో సందడి చేస్తూ
   ముద్దులొలికే ఆ బాల కృష్ణుడు

2. యశోదమ్మ వడిలోన వదిగిపోయి
   మురిపాలు కురిపిస్తూ ఆయమ్మకు
   తన నోటిలో జగమంతా చూపించిన
   జగన్నాథుడు ఆ యశోదా కృష్ణుడు

3. గోపల్లెలోన గోపాలుర ఇంట
   గోపికల ఆటపట్ట మిత్రులతో కలసి
   ముచ్చటగా వెన్న దొంగిలించినట్టి
   నవనీతచోరుడు ఆ శ్రీ కృష్ణుడు

4. పిన్న వయసులోనే పూతన మొదలు
   పెక్కుమంది రాక్షసులనుమట్టుపెట్టి
   పుడమి తల్లికి ముదమొనర్చిన
   ధానవ సంహారి ఆ ముద్దు కృష్ణుడు

5. కాళింది మదమణచి
గోవర్ధన గిరినెత్తి గోపాలుర కాపాడి
గోకులాన్ని రక్షించిన గోవర్ధన గిరిధారి
గోవిందుడు ఆ గోపాల కృష్ణుడు

6. తన వేణునాదంతో వేలమంది
గోపికలను మోహంలో ముంచి
రాధా హృదయాన్ని దోచి తన పేరులో
కలుపుకున్న ఆ రాధా కృష్ణుడు

7. యుద్ధభూమిలోన ధనుర్ధారి
అర్జునునికి కర్తవ్యం భోధించి
మానవాళి మనుగడకు భగవద్గీతను
అందించిన చక్రధారి ఆ శ్రీ కృష్ణుడు

8. హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ
హరే హరే అని నీ నామ జపం
ప్రపంచమంతటా ప్రతిధ్వనించే
విశ్వాత్మ విష్ణుమూర్తి ఆ శ్రీకృష్ణుడు

***

దేవి మహాత్యం(మధుకైటభ వధ)

యుగాంతమందున జగమంతా జలముతో నిండె
విశ్వమంతా బిందువయ్యి విశ్వాత్మను చేరిపోయె
ఆదిమధ్యాంతరహితుడైన ఆ శ్రీహరి శయనించె
ఆదిశేషువు తల్పంగా అనంత సాగరగర్భ మందు

జగన్మాత త్రిమాత్రిక యోగమాయ ఆవహింప
యోగనిద్రలోకి జారిపోయె ఆ జనార్ధనుడు
విష్ణుమూర్తి చెవి జారిన గుబులు నుంచి ఉద్భవించె
మధుకైటభులనే రాక్షసులు అతి ఘోరాకారులు

తమ నెవరు కన్నారు ఈ నీటిలో ఎందుకున్నారు
ఎవరు తమకు చెప్పగలరు అనే ప్రశ్న తట్టగానే
ఒక్క మెరుపు మెరిసింది శబ్దమొకటి వచ్చింది
ఆలోచన చేసారు తమలో తాము ఆ దానవులు

ఈ సృష్టికి మూలమైన పరాశక్తిగా బావించి వారు
ఘోరమైన తపము చేసారు వేయి వత్సరాలు
వర మొక్కటి పొందారు శ్రీ పరమేశ్వరి కృప వలన
"తమ నెవ్వరు చంపలేరు తాము కోరినపుడు తప్ప

తపతపమని కొట్టుకుంటు సముద్రాన్ని ఈదుకుంటూ
అటు ఇటు తిరుగుతు వెతికారు, కానరాలేదు ఎవ్వరూ
కనిపించెను చివరకు కమలనాభుని నాభికమలాన
కూర్చుని వేదాలు వల్లించే చతుర్ముఖ బ్రహ్మాగారు

మదమెక్కిన దానవులు సవాలు చేసారు విధాతను
మాతో చెయ్యి యుద్ధం, లేదంటే వదిలిపెట్టు నీ స్థానం
బయపడిన విరించి ప్రార్థించె శయనించిన శేషసాయిని
యోగమాయ మాయవలన నిదుర నించి లేవడయ్యె

అపుడా పరాశక్తిని ప్రార్థించె ప్రజాపతి “జగన్మాతవమ్మ
నీవు జనార్ధనుడు నిద్రలేవ నీ మాయను వదిలిపెట్టు
దానవులను సమ్మోహితులను చేసి శ్రీహరికి శక్తి నివ్వు”
ఆ పరమేశ్వరి కరుణించెను నారాయణుడు నిద్రలేచెను

ఆ శ్రీనాథుడు తన హస్తములే ఆయుధములుగా
ఐదువేల వత్సరాలు వారితో పోరాడి అలసిపోయె
యోగమాయ సృష్టించిన మోహంలో మునిగిపోయె
బలగర్వంతో మధించిన మూర్ఖులు మధుకైటభులు

నీ యుద్ధానికి మెచ్చాము నీకొక వరమిచ్చాము
కోరుకోమన్నారు జగముల నేలేటి జగన్నాథుడిని
“నన్ను మీరు మెచ్చితే సంతృప్తి చెందితే తీర్చండి
మీ చావే నాకోరిక” అన్నాడు శ్రీమన్నారాయణుడు

చుట్టు ఉన్న నీటిని చూసి చెప్పారా దానవులు
“నీరు లేని చోట చంపు మమ్ము నీకు చేతనయితే”
తన శరీరాన్ని పెంచుకుంటు ఎత్తు ఎంతో ఎదిగాడు
తన మోకాళ్ళను దాటలేదు లోతైన సాగర జలాలు

బాహువులను చాచాడు దానవులిద్దరిని పట్టాడు
ఊరువులపై ఉంచి మధించి చక్రంతో ఖండించెను
దానవుల దేహాల కొవ్వు కరిగి కడలిలోన కలిసింది
నీరు చిక్కపడింది పుడమి తల్లి అవతరించె నానాడు

మధుకైటభుల వధ జరిగె జగన్మాత కరుణతోని
స్థితికారుడు జగన్నాథుడు శ్రీహరి భుజశక్తితోని
భూదేవికి వచ్చింది “మేదిని” అనే మరో నామము
“దేవీ మహాత్మ్యం” తో పడింది నవయుగానికి

***

శ్రీరామ నామం! సర్వపాప హరం!

శ్రీహరి అవతార! సర్వజన రక్షక!
దశరథ నందన! సుందర వదనా!
రఘువంశోత్తమ!రావణ సంహార!
సకల సద్గుణ నిధి! సర్వపాప హరి!

కౌసల్యా సతి నోముల పంటవి!
జానకిమాతను వరించిన సీతాపతివి!
ఆంజనేయ హృదయపీఠ నివాసా!
శుభములనిచ్చే సర్వ మంగళ రూపా!

అయోధ్యరామా! జానకిరామా! కోదండరామా!
కైవల్యరామా! శుభకారక రామా! శ్రీరామా!
శ్రీరామ నామ స్మరణం! సద్గతులకు ఏకైక మార్గం!
సకల పుణ్యాలకు ఆలవాలం! సర్వపాప నాశకరం!

***

2

సంసారం - జీవితం

సంసారం / జీవన గమనం

చెయ్యీ చెయ్యీ పట్టుకుని
ఏడడుగులతో మొదలయ్యే ప్రయాణం

ఇద్దరి మనుషుల కలయికతో
లక్షల మైళ్లు సాగే జీవన గమనం

గుట్టలు పుట్టలు దాటుకుంటూ
ఎత్తు పల్లాలు సరి చేసుకుంటూ

పచ్చిక బయళ్ళను వెతుక్కుంటూ
జలపాతాల దగ్గర సేద తీరుతూ

చెట్టాపట్టాలు వేసుకొని తోడూ నీడగా
బంధాలను కలుపుకుంటూ

బాధ్యతలు ఎత్తుకుంటూ
ముందుకు సాగడమే సంసారం

కొడుకులూ కూతుళ్ళు
మన సంపాదన అయితే

మనవళ్ళు మనవరాళ్లు
మనకు వాళ్ళిచ్చే బహుమతి

సరసాలు సల్లాపాలు
　　　　మురిపాలు సరాగాలు

కలతలు మౌనవ్రతాలు
　　　　అలకలు మూతి తిప్పడాలు

బంధాలు అనుబంధాలు
　　　　బరువులు బాధ్యతలు

కష్టాలూ సుఖాలూ
　　　　ఇవన్నీ సంసారంలో సరిగమలు

***

అమ్మాయి పుట్టింది

“పాప పుట్టింది” నవ్వుతూ చెప్పింది నర్సమ్మ
“మన ఇంటి మహాలక్ష్మి” అంది మా అమ్మ
మా ఆవిడ కళ్ళల్లో కనిపించింది ఆనందం
నా గుండె లోతుల్లో అంతులేని సంతోషం

మా ఇంట పూచింది ఓ మల్లె పూవు
మా జీవితంలోకి వచ్చింది ఓ కొత్త వెలుగు
అమ్మ చెంగు పట్టి వేసింది బుడిబుడి అడుగులు
నా చేయి పట్టి నేర్చింది వడివడి నడకలు

పాఠాలు నేర్చింది చదువులు చదివింది
యువరాణిలా పెరిగి అత్తారింట అడుగు పెట్టింది
మా ఇంట మొలకెత్తిన ఓ చిన్న మొక్క
మెట్టిన ఇంటిని పెంచింది ఓ నిండైన తోటగా

అమ్మాయి రెండు కుటుంబాలకు వారధి
విధి నిర్వహణలో అవుతుంది ఆ ఇంటికి రథసారథి
ఎప్పటికీ మరువదు పుట్టింటి అనుబంధం
ఆడపిల్ల ఉంటేనే కదా ఏ ఇంటికైనా అందం!

***

అమ్మ – నాన్న

అమ్మా నాన్నలు ఇద్దరూ
ఆ దేవుని కనిపించే రూపాలు
మన జన్మకు వాళ్ళే సృష్టికర్తలు
మనకి సదా పూజనీయులు

***

తల్లి – తండ్రి

తల్లిని మించిన దేవతయు
తండ్రిని మించిన దైవమును
దొరకరు ఎంత వెదికినను
ధరలో శ్రీరామునికైనను

***

తోడు నీడ

నీకు తోడుగా ఉంటూ, నీ అవసరాలు తీరుస్తూ
నీ చాదస్తాలు భరిస్తూ, నిన్ను నిన్నుగా చూస్తూ
నీ జీవన గమనంలో సఖి, నీ కష్ట సుఖాలలో తోడూనీడ
నీ సంసార నావకి చుక్కాని, నీ ధర్మపత్ని కాక మరెవ్వరు?

***

గురు స్మరణ

పాలు త్రాగే వయసు లోనె
ప్రధమంగా పాఠాలు నేర్పి
మమతలు ఎన్నో పంచిన
మాతృమూర్తి కి వందనం

అడుగులు తడబడు నప్పుడు
వెన్ను తట్టి నడకలు నేర్పి
నీతి పాఠాలు చెప్పిన
నాన్నగారి కి వందనం

అక్షరాలతో మొదలు పెట్టి
చేయి పట్టి రాత నేర్పి
జ్ఞానాన్ని పంచి ఇచ్చిన
గురువులు అందరికీ వందనం

***

చిట్టి పాపాయిలు

చిట్టి పాపాయిలు - చిలిపితనపు బుజ్జాయిలు
చింతలేని జీవులు - చిరంజీవులు
చిలుక పలుకుల - చిన్నారులు
చిలకరించే నవ్వులు - చిరు జల్లుల వానలు
చిన్ని చిన్ని చేతులు - చిందులు వేసే పాదాలు
చిచ్చుబుడ్డిలు - చిచ్చర పిడుగులు
చిదానంద స్వరూపాలు - చిన్మయ మూర్తులు
చిద్విలాస తరంగాలు - చిత్రమైన చలాకి చేష్టలు
చిక్కని చల్లని వెన్నెల - చిందించే చందమామలు

***

సతీపతులు

సతి తోడు లేని పతి గతి
పతి నీడలేని సతి గతి

తోక తెగిన గాలిపటం రీతి
గోచరించని శేషజీవన స్థితి

సీతను వీడిన రాముడు
రాధకు దూరమైన కృష్ణుడు

లక్ష్మిని ఎడబాసిన విష్ణువు
సతీ వియోగం చెందిన శివుడు

జీవరాశి లేని గ్రహంలా
కాంతి క్షీణించిన నక్షత్రంలా

ప్రకృతి శపించిన పురుషులా?
శక్తిని మరచిన పరమాత్ములా?

***

జీవిత పరమార్థం

రా రమ్మంటే రాదు జ్ఞానం
పో పొమ్మంటే పోదు మూర్ఖత్వం

పొందాలంటే జ్ఞానం,
కావాలి గురువుల ఆశీర్వచనం

పోవాలంటే మూర్ఖత్వం,
కావాలి దేవుని అనుగ్రహం

మెప్పించు కృషితో నీ గురువులను
సాధించు భక్తితో భగవంతునికృపను

దేవుని అనుగ్రహం, గురువుల ఆశీర్వచనం
రెండూ ఉంటేనే సాధిస్తావు జీవిత పరమార్థం

***

శబ్దం - మూలం

శబ్దం అంటే అర్థం ఏమిటి?

శబ్దం ప్రయాణించే వాయు తరంగం
శబ్దం చెవి పొరలను కదిలించే పీడనం
శబ్దం సృష్టించగలదు ఓ ప్రభంజనం
శక్తికి తొలి వ్యక్త రూపం శబ్దం

పంచభూతాలకు ప్రథమ లక్షణం శబ్దం
శబ్దేంద్రియానికి దిక్కులు అధిష్టానం
శబ్ద తరంగ ప్రసారానికి
దిక్కులన్నీ సమానం

ఓంకార ప్రణవ శబ్దం
ధార్మిక సిద్ధాంతానికి ఆధారం
వేద మంత్ర శక్తి సారం
గళ స్వర శబ్ద నిక్షిప్తం

***

శబ్దం - సంగీతం

శబ్దం చైతన్యానికి రూపం
శబ్దం సరిగమలతో సంగీతం

సంగీతానికి సప్త స్వరాలు మూలం
రాగం సప్త స్వరాల సమూహం

సరిగమపదనిసలతో ఆరోహణ అవరోహణ
శృతి రాగం తాళం సంగీతానికి లక్షణాలు

శబ్దాన్ని కాలంతో వినసొంపుగ మేళవిస్తే సంగీతం
శబ్ద మధురిమల నాట్యం సంగీతశాస్త్ర విజ్ఞానం

శబ్దం మితిమీరితే కాలుష్యం
నిశ్శబ్దం నీరసానికి ప్రతిరూపం

***

శబ్దం - జీవితం

కన్నె పిల్లల కిలకిలలు
కుర్రకారు గుండె చప్పుళ్ళు

ప్రేయసి ప్రియుల గుసగుసలు
మత్తెక్కించే మధుర శబ్దాలు

ప్రసూతి వేదన పసివాడి రోధన
ప్రేమించే తల్లి తండ్రుల లాలన

పిల్లల చిన్నతనపు అల్లర్లు
పెద్దవాళ్ళ అదిలింపులు

అమ్మమ్మ చెప్పేపురాణం
పండితుడు చెప్పే ప్రవచనం

ఉపాధ్యాయుడు చెప్పే పాఠం
సభలో మాట్లాడే ఉపన్యాసం

అయ్యగారు ఇచ్చేఆశీర్వాదం
పురోహితుడు పలికే మంత్రం

వంటిట్లో గిన్నెల చప్పుళ్ళు
టెలివిజన్ లో ప్రసారాలు

వాహనాల రణగొణ ధ్వనులు
నాయకుల ఎన్నికల ప్రచారాలు

పెళ్ళిలోని బాజాలు బజంత్రీలు
శబ్ద తరంగ పీడన విన్యాసాలు

నగరా దుందుభి మ్రోతలు
సేనాధిపతుల శంఖారావాలు

మదుపు టేనుగు ఘీంకారాలు
తప్పక భీకర సమర సంకేతాలు

***

శబ్దం - ప్రకృతి

ఆకాశంలో మేఘాల గర్జనలు
వర్షపు చినుకుల టపటపలు

భూగర్భంలో ప్రకంపనలు
సముద్రతటంలో అలల ఘోషలు

తుఫానులో ఈదురు గాలుల భీభత్సాలు
అన్నీ ప్రాకృతిక శబ్ద ప్రసారాలు

కోయిల కూతలు చిలుక పలుకులు
వీధిలో కుక్కల అరుపులు

తేనెటీగల ఝుంకారాలు
రాత్రిపూట కీచురాళ్ళ ధ్వనులు

సృష్టిస్తాయి ప్రకృతి సిద్ధ శబ్ద తరంగప్రసారాలు
డాల్ఫిన్లు, పార్పోయిస్లు జలతరంగ పీడనంతో

సముద్ర గర్భంలో సృష్టిస్తాయి
శ్రావ్యమైన మధుర ధ్వనులు

***

శబ్దం – సాంకేతిక ఉపయోగం

కడుపులోని కణితుల్ని
పుట్టబోయే శిశువుల్ని

అంతర్గత అవయవాల
పరిమాణంలో మార్పుల్ని

వైద్య పరీక్షలో గుర్తించే సాధనాలు
శబ్దతరంగ చాయా సృష్టిపరికరాలు

జల ఉపరితల నౌకలు అయినా
జల అంతర్గతగాములు అయినా

నీటి లోతు కొలవాలన్నా
మార్గంలో అవరోధాలు కనిపెట్టాలన్నా

శత్రుజాడ తెలియాలన్నా
మిత్రులకు సమాచారం పంపాలన్నా

అతి సున్నిత శబ్దపరివర్తక సాధనాలతో
సృష్టిస్తాయి కృత్రిమ శబ్ద తరంగ ప్రసార సంకేతాలు

3

ప్రేమ - ప్రణయం

ఇల్లాలి అలుక

మొదటిసారి నిన్ను చూస్తే
వళ్ళు పులకరించింది

మనస్సు గాల్లో తేలింది
మెదడు మొద్దు బారింది

మరోసారి నిన్ను కలసి
మాటలతో నిన్ను గెలిచి

నీ మనసును దోచుకున్నా
నా దానిగా చేసుకున్నా

అలుక ఎందుకు నాపైన?
సఖీ! నన్ను కనికరించవా?

నన్ను దూరం పెట్టకుండ
విరహం లో ముంచకుండ

నా చెంతకు చేరవా?
నా కౌగిట వాలవా?

***

ప్రేయసి కినుక

ముసిముసిగా నవ్వుకుంటునిన్ను నువ్వు వచ్చావు
మాటలెన్నో చెప్పావు మురిపాలు పోయావు

నా చేతి మీద గిల్లావు బుగ్గనేమో కొరికావు
నా గుండె మీద వాలావు గుసగుసలు ఆడావు

ఈ రోజు వచ్చావు కోపంగా చూస్తున్నావు
స్థంభాన్ని పట్టుకొని కాలునేల రాస్తున్నావు

మూతి తిప్పుతున్నావు మొహం దాస్తున్నావు
దగ్గరగా రాలేదు మాటలేమీ చెప్పలేదు

నా చదువులు నేర్పలేదు నీ భావం తెలుసుకోను
అలుక ఏందు కొచ్చిందో కారణం తెలియరాదు

ఇంక జాగు చేయకుండ కరుణించి దరిచేరు
నీ కోరిక తీర్చనా? నిన్ను ముద్దు చేయనా

పక్కుమని నవ్వుతూ నాదగ్గర కొచ్చింది
బుంగ మూతి పెట్టింది బొంగరంలా తిప్పింది

నాకెందుకు కినుక నిన్ను ఆటపట్టించా అంటూ
వలపు వలక పోసిందివళ్ళోకి చేరింది, నా ప్రేయసి

ఎంతచక్కనిచుక్కరా

ఎంత చక్కని చుక్కరా
ఏటి గట్టున ఉందిరా

నా మనసే దోచిందిరా
నా మదినే దొలిచిందిరా

కడవ పట్టు కున్నాది
కొంగు కప్పు కున్నాది

అటూ ఇటూ చూస్తోంది
కాలు నేల రాస్తోంది

నీటి కోసం వచ్చిందా?
నాకై ఎదురు చూస్తోందా?

నన్ను ఒప్పు కుంటుందా?
తన ప్రేమను పంచుతుందా?

***

పల్లె పడుచు

చీర పైకి కట్టావు,
　　　　కాళ్ళకు పట్టీలు పెట్టావు
జడలో పూలు తురిమావు,
　　　　వయ్యారం వలికించావు
గంప నెత్తిన ఎత్తినావు,
　　　　చేత కొడవలి పట్టావు
ఇంటి బయట కొచ్చినావు,
　　　　పొలం బాట పట్టావు
నీ పెదవి పైన నవ్వు ఉంది,
　　　　నీ నడకలో నాట్యం ఉంది
ఈల వేసి నవ్వాడు ఓ కొంటె కుర్రాడు
　　　　ఓర చూపు చూసాడు చిట్టినాయుడు
నా కళ్ళు చెదర గొట్టావు నీ రూపంతో
　　　　నా గుండె లదర గొట్టావు నీ చూపులతో
నా మనసు కట్టి పెట్టావు నీ తలంపుతో
　　　　నా నిదుర చెదర గొట్టావు నీ కలలతో

***

ఓ పున్నమి రాత్రి

ఓ చల్లని రాత్రి ఓ పున్నమి రాత్రి
తెల్ల చీర కట్టుకుని
మల్లె పూలు పెట్టుకుని
చేత పాల గ్లాసు పట్టుకుని

సిగ్గుతో ఎరుపెక్కిన బుగ్గలతో
నేల చూపులు చూస్తూ
బిడియంగా నడుకుంటూ
వచ్చింది నా గది లోకి ఓ కన్య

నా దగ్గరకి నా హృదయంలోకి
మాట మాట కలిసింది
మనసు మనసు తెలిసింది
మా ప్రయాణం మొదలయ్యింది

హఠాత్తుగా మెలకువ వచ్చింది
ఎన్నో సంవత్సరాల నాటి నా గతం
మనస్సులో మెదిలింది ఆ క్షణం
మరువలేని ఆ మధుర స్మృతి

చిలుక గోరువంక

నింగి లోన చందమామ
పెరటి లోన మల్లె మొక్క
మిద్దె మీద పండు వెన్నెల
అక్కడో ముచ్చటైన కొత్త జంట

చూడు చూడు ఆ చెట్టు వంక
దానిమీద కూర్చుంది ఓ గోరువంక
పక్కకి వచ్చి చేరిందో చక్కని చిలుక
ఎంత బాగుందో ఆ జంటల కలయిక

చాలదా ఈమాత్రం ఇతివృత్తం
ఇక మొదలెట్టనా కథ రాయటం

***

పున్నమి చంద్రుడు

పున్నమి చంద్రుడు
కృత్తికతో కలిస్తే అవుతుంది ఆ మాసం కార్తీకం
మృగశిరతో కలిస్తే అవుతుంది ఆ మాసం మార్గశిరం

ప్రియుడు తన ప్రేయసిని
ఎప్పుడు కలిసినా అవుతుంది అది వసంతం
ఎక్కడ కలిసినా అవుతుంది అది స్వర్గం

***

రస హృదయం

రాయవరం సంతకెళ్ళి
రాళ్ళ గాజులు కొంటుంటే
రాసుకుంటూ ముందుకెళ్ళి
రమ్మంటూ సైగచేసి
రమ్యంగా కన్నుగీటె
రాలుగాయి కుర్రాడు
రాబోయే మాఘంలో వాడు
రేపటి నా కాబోయే మొగుడు

***

రస సూక్తి

ఆలిని పొగిడిన
కరుణించి కౌగిట జేరున్
వెలయాలిని పొగిడిన
చాలిక పోయి సొమ్ము తెమ్మనున్

***

రస నీతి

కోరకుండగనే ఏదైనా దొరికితే
కాదు అనరు ఎంతటి వైరాగ్యులైనా!
కోరుకున్న భామిని చెంత జేరితే
కాదంటాడా! ఏ రసికుడైనా!

***

4

హాస్యం - వినోదం

పాఠాలు నేర్పాయి చిట్టి దోమలు

చిట్టి చిట్టి దోమలు
బుజ్జి బుజ్జి అమ్మలు

మొహం మీద వాలాయి
నన్ను నిద్రలేపాయి

కాస్త నేను కదిలితే
ఏ మూలకో పోతాయి

మళ్ళీ మళ్ళీ వస్తాయి
ఎగురుకుంటూ వెళ్తాయి

కుట్టడం చేతకాదు
ఇంకా పాట కూడా నేర్వలేదు

వాటికి తిండెవడు పెడతాడు పాపం
వాళ్ళమ్మ చూసుకుందా దాని స్వార్ధం

నాకేమీ రాలేదు వాటి మీద కోపం
ఇంతలోనె వచ్చిందో పెద్ద దోమ

దాన్ని చుట్టు ముట్టాయి చిట్టి దోమలు
అది చెప్పినట్టు ఉంది పాఠాలు

నా వైపు చూపించింది అది ఎందుకనో
నా దగ్గర కొచ్చింది నా చుట్టూ తిరిగింది

నా చేతి మీద కుట్టింది పెద్ద దోమ
కుట్టిన చోట వాలాయి చిట్టి దోమలు

తలకాయలు ఊపాయి అర్థమైనట్టు
పాఠాలు నేర్చాయి చిట్టి చిట్టి దోమలు

ఇక అవుతాయి
అవే పెద్ద పెద్ద దోమలు

***

వ్యంగ్య కవితలు

పుట్టినరోజునాడు కొత్తబట్ట లేసుకుని
కులాసాగా నడుచుకుంటూ పోతుంటే
పడవలాంటి కారొచ్చి బురద జల్లిపోతే
ఎలాగుంటుంది? వాడి కెలాగుంటది?

రాజావారి వీధిలో రాములోరి గుడికాడ
చిన్నదాన్ని చూసి కన్నుగీటి సైగచేస్తే
వెనక వచ్చిన వాళ్ళన్న చితక్కొట్టి పోతే
ఎలాగుంటుంది? వాడి కెలాగుంటది?

అప్పు మీద అప్పు చేస్తే వడ్డీ మీద వడ్డీ పెరిగె
కిస్తీలు కట్టలేక వాడు కుస్తీలు పడుతుంటే
అప్పిచ్చిన వాడొచ్చి వాడి చొక్కా పట్టుకుంటే
అప్పుడు ఎలాగుంటదీ? వాడి కెలాగుంటది?

ప్రజలు వేసిన ఓట్లతోను పదవుల్ని పొంది
ప్రభుత్వం సొమ్ముతోనే పైపైకి ఎదిగి
ఆ ఓటేసిన జనాలే వాడ్ని తిట్టిపోస్తేను
అప్పుడు ఎలాగుంటదీ? వాడి కెలాగుంటదీ?

మందితోన మందు తాగి
మత్తు లోన ఇంటికొచ్చి
పెళ్ళాంతో తిట్లు తింటే
ఎలాగుంటుంది? వాడి కెలాగుంటది?

గ్లాసులోని మందు చుక్క
ప్లేటు లోన చికెన్ ముక్క
పక్కనేమో చక్కని చుక్క
అదే కదాస్వర్గం ఇంక

***

సలహా

గిరీశం:

ఏమిరా అలావున్నావ్?
ఏమిటి నీ ప్రోబ్లమ్?

చెప్పరా నీ బాధని,
దింపుకోరా నీభారాన్ని!

వెంకటేశం:

మా వీధిలో ఒకడు ఉన్నాడు,
నన్ను ఎప్పుడూ ఏడిపిస్తాడు

నాకో సలహా ఇవ్వవా,
నువ్వు నన్ను కాపాడవా!

గిరీశం:

నీవు గుప్పెడు ఎత్తు ఎక్కువ ఉంటే,
వాడి చెంప మీద చాచి కొట్టు

మరీ జానెడు అంత పైన ఉంటే,
గట్టిగా జుత్తు పట్టి కొట్టు

నీ చేతుల్లో బలము ఉంటే,
వాడి గొంతు పట్టి నొక్కు

కాళ్ళల్లో శక్తి ఉంటే,
కిందవేసి తొక్కి పెట్టు

రౌడీలను కొనాలి అంటే,
నీదగ్గర ఉందిరా సొత్తు

ఇవి ఏమీ లేకుంటే,
బెట్టంతా వదలి పెట్టు

వాడి పెళ్ళాం కాళ్ళు పట్టు,
స్వీటు పేకెట్టు చేతిలో పెట్టు

అక్కా! అని ఏడుపు మొహం పెట్టు!
ఇంక వాడి ఆట కట్టు!

వెంకటేశం:

నీ సలహాతో పోయింది నా మతి!
కాళ్ళు పట్టడమే నాకిక గతి!

***

నా ఊహల్లో

మెల్ల మెల్లగా గాలిలో తేలాలని ఉంది
మబ్బుల్లో ఎగురుతూ గెంతాలనిఉంది

ఆకాశం అంచులు అందుకోవాలని ఉంది
చందమామను ముద్దాడాలని ఉంది

అంతరిక్షంలో ప్రయాణించాలని ఉంది
భూగోళం అందాలను అవలోకించాలని ఉంది

బ్రహ్మలోకం సందర్శించాలని ఉంది
బ్రహ్మాండం అంచులు చూడాలని ఉంది

హరిశ్చంద్రునితో 'అబద్ధం' ఆడించాలని ఉంది
బలిచక్రవర్తితో 'లేదు' అని అనిపించాలని ఉంది

ఎడారిలో వాహ్యాళికి వెళ్ళాలని ఉంది
అడవిలో మృగాలతో ఆడుకోవాలని ఉంది

మేరు పర్వతం పైకెక్కి మురిసిపోవాలని ఉంది
సముద్రపు లోతుల్లో సంచరించాలని ఉంది

పాతాళంలో ఆదిశేషుని దర్శించాలని ఉంది
పరమాత్మ పాదాలను స్పృజించాలని ఉంది

దేశాల సరిహద్దులు చెరిపి వేయాలని ఉంది
మానవజాతిని ఏకం చేయాలని ఉంది

ప్రపంచ ప్రజాపరిషత్తు స్థాపించాలని ఉంది
ప్రజలందరు సంతోషంతో జీవించాలని ఉంది

***

చిన్ననాటి చిలిపి చేష్టలు

చిన్నప్పటి ఆటలు, చిన్ననాటి చిలిపి చేష్టలు
చిన్న పాటి గొడవలు, చింతలు లేని రోజులు

కోతి కొమ్మచ్చిలు దొంగాటలు ఆడాము
కోతి పనులూ కొంటె చేష్టలూ చేసాము

ఏటి గట్టు మీద గెంతుతూ గడిపాము
ఏటి ఇసుకలో గుజ్జన గూళ్ళు కట్టాము

మామిడి తోటలో ఉయ్యాలలు ఊగాము
నేల బావిలో చెప్పకుండా ఈతలు కొట్టాము

తోటలో మామిడి కాయలను తెంపాము
తోటమాలి వస్తే వేగంగా పరుగులు తీసాము

కొబ్బరి తోటల్లో ఆడుతూ బొండాలు తాగాం
కొబ్బరిలో లేత గుజ్జు కొబ్బరి పువ్వూ తిన్నాం

తాటిపండు తియ్య దుంపలు వేరుశనగ పిక్కలు
తాటాకుల మంట పెట్టి పాతరేసి తిన్నాము

ఫ్రెండు తెచ్చిన ఊరేసిన చిన్న ఉసిరికాయలు
స్కూలు దగ్గర అమ్మేటి బెల్లపు జీళ్ళు బటానీలు

తిరునాళ్ళలో అమ్మేటి పంచదార చిలకలు
పీచు మిఠాయిలు పుల్ల ఐసు ఫ్రూట్లు తిన్నాం

చెరుకు గడలు పంటితో పీక్కుంటూ తిన్నాం
రసాల మామిడిపళ్ళు చీక్కుంటూ తిన్నాం

హోమ్వర్క్ చేయకపోతే గుంజీలు తీసాము
లేటయితే స్కూలు బయట ఎండలో నిలిచాము

మాష్టారు పెట్టిన మొట్టికాయలు తిన్నాం
ఎప్పుడైనా పెట్టిన సొంటి పిక్కలూ భరించాం

ఆటలు ఆడాము పాటలు పాడాము
అల్లర్లు చేసాము పాఠాలు చదివాము

కొట్టుకున్నాం తిట్టుకున్నాం
జుట్లు కూడా పట్టుకున్నాం

అయినా స్నేహాన్ని ఎప్పుడూ వదల లేదు
ఇప్పటికీ ఆ స్నేహితులను మరువ లేదు

***

స్మార్ట్ ఫోన్

ఏమయ్యాయి? ఎక్కడకు పోయ్యాయి?
హాలులో ఉండే ముచ్చటైన టెలిఫోన్
రికార్డు నుండి పాట వినిపించే గ్రామఫోన్
మేజిక్ ఐ మల్టీ బేండ్ రేడియో
వాక్ మేన్, రికార్డు ప్లేయర్,
మ్యూజిక్ ప్లేయర్, రీలు కెమేరాలు,
సోనీ డిజికేమ్, హేండీ కేమ్ లు,
అన్నింటిని మింగిన బకాసురుడు స్మార్ట్ ఫోన్

మాటలు ఆడాలన్నా, పాటలు వినాలన్నా
ఫొటోలు తీయాలన్నా, టివి చూడాలన్నా
మెసేజ్ పంపాలన్నా, ఛాటింగ్ చేయాలన్నా
ఈమెయిల్ పంపాలన్నా, వెబ్ బ్రౌజింగ్ చేయాలన్నా
వాట్సప్, ట్విట్టర్, ఫేస్ బుక్, పుస్తకాలు
యూట్యూబ్, హాట్ స్టార్, నెట్ ఫ్లిక్స్, సినీమాలు
ఎప్పుడు ఏమిటి చెయ్యాలన్నా చూడాలన్నా,
అన్నింటికీ స్మార్ట్ ఫోన్, స్మార్ట్ ఫోన్, స్మార్ట్ ఫోన్

గంటలు గంటలు స్మార్ట్ ఫోన్ లో
చూస్తూ చేస్తూ పోతూ ఉంటే
కంటి చూపు తగ్గిపోయి
కనుల కాంతి చెదిరిపోయి
మెదడు మొద్దుబారి పోయి
మనిషి ఆలోచనలు చచ్చిపోవా!

ఎప్పుడో ఎవరో రాసినట్టు
స్మార్ట్ ఫోన్ విరగ గొట్టు
బ్యాటరీ ని పాతి పెట్టు
చార్జర్ ని చితక గొట్టు
హాయిగా కునుకు పెట్టు
మెదడు మరల చురుకవ్వు
బుద్ధి తప్పక వికసించు
ప్రశాంతత తిరిగి వచ్చు

***

5

మనిషి - వ్యక్తిత్వం

నేను అనే అహం

నేను పాడితే పాట
    నువ్వు పాడితే గోల
నేను ఆడితే ఆట
    నువ్వు ఆడితే అల్లరి
నేను చేస్తే ఖర్చు
    నువ్వు చేస్తే దుబారా
నేను చేస్తే రాజకీయం
    నువ్వు చేస్తే మోసం
నేను చేస్తే వ్యాపారం
    నువ్వు చేస్తే దోపిడి
నేను చెప్పేవి నీతులు
    నువ్వు చెప్పేవి బూతులు
నేను చూపేది ప్రేమ
    నువ్వు చూపేది కామం
నేను రాస్తే కవిత
    నువ్వు రాస్తే చెత్త

***

నేను – మనం

అనే భేధ భావం వదలిపెట్టు
మనం అనే బంధంతో ముడిపెట్టు
ఉండాలి అందరూ కలిసి మెలసి
అదే కదా అందరికీ చేయు మంచి

నేను అంటే ఒంటరితనం, మనం అంటే ఐకమత్యం
నేను అంటే స్వార్ధం, మనం అంటే పంచుకోవడం
నేను అంటే మూర్ఖత్వం, మనం అంటే జ్ఞానం
నేను అంటే కారాగారం, మనం అంటే పూలవనం

మనంలోని మాధుర్యం అనుభవించు
మనంలోని మమకారం పంచిపెట్టు
మనంలోని మంచితనం తెలియచెప్పు
మనంలోనే మానవత్వం పరిమళించు

మనం కలసి ఆడుదాం
మనం కలసి పాడుదాం
మనం కలసి నడుద్దాం
మనం ముందుకు సాగుదాం

***

ప్రకృతిలో పరవశించు

ప్రకృతిలో పరవశించు
పరమేశుని భజించు

భూమి పైన నివశించు
ఆకాశానికి మెట్లు కట్టు

శక్తి యుక్తులను ఉపయోగించు
శ్రమిస్తూ ముందుకు ప్రయాణించు

నీ గమ్యాన్ని తప్పక సాధించు
ఫలితాన్ని హాయిగా అనుభవించు

తోటి మానవులను ప్రేమించు
అందరికీ ఆనందాన్ని పంచు

***

మనిషి – మానవత్వం

ఎంత పెద్దచదువులు చదివినా
    ఎన్నిగొప్ప పదవులు పొందినా
స్వార్థంలో మునిగిపోయి
    ప్రజల సొమ్ము కాజేసి
మంచితనం మరిచిపోయి
    మృగంగా మారిపోతే
దయ జాలి కనుమరుగు అయిపోతే
    మర్యాద క్రమశిక్షణ మట్టి కలిసిపోతే
నిజాయితీ నమ్మకాలు నీరు కారిపోతే
    మానవత్వం మంట కలిసి పోలేదా
అట్టడుగున ఉన్నవాడు
    పొట్టకూటి కోసము
ఓటు అమ్ము కుంటాడు
    వంగి దణ్ణం పెడతాడు
అన్నీ ఉన్న మనం
    ఎందుకు ఇలా ఉంటాము?
కుల మతాల సరిహద్దులు చెరిపేసి
    నీ ప్రేమను సమానంగ పంచు
అన్యాయం చెయ్య వద్దు
    అహింస మరువ వద్దు

బాధితులపై జాలి చూపు
అభాగ్యులపై కరుణ చూపు
అసహాయులను ఆదుకొమ్ము
స్వార్థాన్ని పారద్రోలు
నువ్వు నమ్మిన నిజాలు
నువ్వు చెప్ప నప్పుడు
నువ్వు చెప్పిన మాటలు
నువ్వు అనుసరించ నప్పుడు
సమాజంలో నువ్వు
ఎంత పెద్ద గొప్పవాడివి అయినా
ఆత్మసాక్షికి నువ్వు
అతి చిన్నవాడివే
వ్యక్తిత్వం మలుచుకొని
సమాజానికి సేవ చెయ్యి
అప్పుడే అవుతావు
మానవత్వం ఉన్న మనిషివి నువ్వు

***

మనిషి

మతములు అన్నీ వేరైనా, మానవత్వం ఒక్కటే
కులములు అన్నీ వేరైనా, కలిసి ఉండాలి మనిషిలే
కలిమి ఉన్న లేకున్నా, కూడు గుడ్డ అవసరమే
కాలం కలిసి రాకుంటే, కష్టాలు రాక తప్పవులే

***

స్వార్ధం

మనిషికి ఉండకూడదు, మితిమారిన స్వార్ధం
అలా ఉంటే తెలియదు, 'జీవితం' అంటే వాడికి అర్ధం
అటువంటి వాడి 'మానవ జన్మ' పూర్తిగా వ్యర్ధం
మనంతెలుసుకోవాలి, పరోపకారంలోని పరమార్ధం

***

మంచి - చెడు

మంచి చేయాలని తలిస్తే
మార్గాలు కొన్నైనా దొరకవా!
మదిలో చెడు ఆలోచన ఉంటే
మార్గాలకు కొదవేమిటి సుమా!

***

అహం

అహం మత్తులో మునిగిపోతే
అహంకారం నెత్తికి ఎక్కితే

మమత అనురాగాలు మరచిపోయి
మనిషి మృగముగా మారిపోడా!

అహం పెరిగి ఆకాశాన్ని అంటితేను
బుద్ధి భూగర్భానికి జారిపోదా?

దుష్ట చర్యలు పెచ్చుమీరి
మనిషి రాక్షసుడిలా రగిలిపోడా?

మనిషిని అహం చంపుతుంది
మనిషి అహాన్ని చంపుకుంటే

మనిషిని నిండుగ నిలుపు తుంది
మమతానురాగాలు పండిస్తుంది

***

నిజం – అబద్ధం

మట్టిలో పుట్టిన వింత జీవులం
బుద్ధి వికటించిన మనుషులం
నిజాన్ని అబద్ధం అని నమ్మేస్తాం
అబద్ధాన్ని నిజం అనుకుంటూ జీవిస్తాం

బాధలన్నీ గుండెల్లో దాచేస్తాం
మొహం మీద చిరునవ్వును పులిమేస్తాం
నిజమైన జీవితాన్ని వ్యర్థంగా గడిపేస్తాం
నిద్రలోని కలలను నిజమని నమ్మేస్తాం

'మనకు మనమే సాటి'
అనుకుంటూ బ్రతుకేస్తాం
'మన లోపాలను' నిజమని
ఎప్పటికీ ఒప్పుకోం

మనస్సు చెప్పే వింత కోరికల వెంట పడతాం
మన బుద్ధి చెప్పే వివేకాన్ని గాలికి వదిలేస్తాం
అబద్ధపు పొగడ్తలకు పొంగిపోతాం
అద్దం చెప్పే నిజాన్ని క్రీము పౌడర్లతో కప్పేస్తాం

అబద్ధాన్ని పాయసంలా ఆత్రంగా జుర్రేస్తాం
అసలు నిజాన్ని విషంలా దూరం పెడతాం
నిజం నిర్భయంగా నిలబడి ఉంటుంది
అబద్ధం తెరవెనుక దాగి ఉంటుంది

నిజం వజ్రంవలె స్వచ్ఛంగా మెరుస్తుంది
అబద్ధం ఊసరవెల్లిలా రంగులు మారుస్తుంది
నిజాన్ని ఎప్పుడూ చంపేస్తాం
అబద్ధానికి ఆయువు పోస్తూనే ఉంటాం!

జీవితం తరిగిపోయే సత్యం,
చావనేది తిరుగులేని నిజం
అయినా భవిష్యత్తు అనే భ్రమలో
బ్రతుకుతూనేఉంటాం

చర్మం పైపొరలోనే ఉంటుంది కదా
కనిపించే సౌందర్యం
కాని గుండె లోతుల్లో దాగి ఉంటుంది
అసలైన ఆనందం

***

స్వార్థం - పరమార్థం

నీకు పెద్ద పదవి ఉండి
నీ ఆర్జన బాగా ఉండి

నీ నల్లధనం చల్లగుండి
నీ ఇల్లు స్వర్గంలా ఉండి

నీ ఆస్తులు ఎన్నో ఉండి
నీ ఆస్తి విలువ పెరుగుతూ ఉండి

నీ వాళ్ళు హాయిగ ఉంటే
నీ కోరికలు తీరుతూ ఉంటే

నీ చుట్టూ సేవకులు ఉంటే
నీ ఆజ్ఞలను పాటిస్తూ ఉంటే

నీకు నీవు దైవం లాగా
స్వర్గంలో దేవేంద్రుని లాగా

రెండు వేల నోటు లాగా
స్వచ్ఛమైన నీటి లాగా

మిగిలిన వాళ్ళంతా
చాకిరీ చేసే గాడిదల్లాగా

విలువ తక్కువ నాణేల్లాగా
 మురికి నీటి కాలువల్లాగా

కన్నూ మిన్నూ కానకుండా
ముందు వెనుక చూడకుండా

మంచి చెడూ మరచి పోకు
మానవత్వాన్ని మంట గలపకు

స్వార్థం కొంత వదలు కొనుము!
పరమార్థం తెలుసు కొనుము!

నీ నడతని మార్చు కొనుము!
ముక్తి మార్గం వెదుగు కొనుము

***

సూక్తి

నీకు నచ్చింది నువ్వు చెప్పు
- అది నీ ఇష్టం
నాకు నచ్చింది నేను చేస్తాను
- ఇది నా ఇష్టం

***

పేదవాడు – దరిద్రుడు

రోజంతా కష్టపడుతూ
ఉన్నదాంతో తృప్తిపడుతూ

ఉన్నప్పుడే తినేవాడు
అవుతాడు పేదవాడు

ధనం లేని పేదవాడు
ఉన్నదేదో తింటాడు

లేకుంటే పస్తుంటాడు
కాని హాయిగా నిద్ర పోతాడు

ఉన్నదంత దాచి పెట్టి
ఉండి కూడ లేదంటూ

ఎదుట వాడిపై ఏడ్చేవాడు
అవుతాడు దరిద్రుడు

ఎన్ని ఉన్నా ఎంతఉన్నా
ఎవరికీ ఏమీ పెట్టకుండా

తాను కూడ తినకుండా
దోచుకుంటు దాచుకుంటూ

ప్రజల సొమ్ముకు ప్రాకులాడుతు
పరుల ఉన్నతికి ఏడ్చేవాడు

ఎంత గొప్ప వాడైనా
ఈ ధరణి పైన దరిద్రుడు

ఎదుటి వాడినిచూసి ఏడ్చేవాడు
పక్క వాడినిచూసి కుళ్ళేవాడు

అన్నీ ఉన్నా అనుభవించనివాడు
వాడే కదా అసలైన దరిద్రుడు

***

పులి – పిల్లి

పులిని చూసి పిల్లి అని భ్రమపడితే
పీక పట్టి పిసికి
పీక్కు తింటే, చస్తాం!

పిల్లిని చూసి పులి అని భయపడితే
పిరికితనంతో ప్రతీసారి
పరుగులెత్తి, పారిపోతాం!

పులిని పులిగా, పిల్లిని పిల్లిగా గుర్తిస్తే
ప్రయత్నించి జీవితంలో
పురోగతిని, సాధిస్తాం!

***

కష్టం – సాయం

ఎవడి కయినా కష్టం వస్తే
మనసు ఉంటే జాలి పడు

చేత నైతే సాయం చెయ్యి
లేక పోతే నోరు ముయ్యి

కథలు ఎన్నడు చెప్పకయ్య
కొంచెం సానుభూతి చూపవయ్య

భక్తి లేని మనిషికి
ముక్తి రాదు అని అంటారు

మానవత్వం లేని వాడిని
మనిషే కాదంటారు

పంచభక్ష్య పరమాన్నాలు
ఉంటే ఆస్వాదిస్తూ తినండి

పేదవాడి కడుపు కొట్టి
వాడి నోటి ముద్ద లాగకండి

పట్టు పీతాంబరాలు ఉంటే
ఆనందంగా కట్టుకోండి

పేదవాడి చిరుగు చొక్కా
　　　　　పీక్కోవాలని చూడకండి

పడవలాంటి కారు ఉంటే
　　　　　కులాసాగా తిరగండి

పేదవాడిని రోడ్డు మీద
　　　　　నడవకుండా చేయకండి

పెద్ద పెద్ద భవనాలు కట్టుకుని
　　　　　ఆనందంగా వాటిలో ఉండండి

పేదవాడి పూరి గుడిసె మాత్రం
　　　　　నేల మట్టం చేయకండి

మన బ్రతుకును మనం బ్రతుకుదాం
　　　　　పేదవాడి బ్రతుకును నిలబెడదాం

***

మానవ కర్తవ్యం

భగవంతుని స్మరించు,
ఎల్లప్పుడు ధ్యానించు

చేతులతో పూజించు,
నోటి తోటి కీర్తించు

మనసును నియంత్రణలో పెట్టు
మదిలో బుద్ధిని పొదిగి పెట్టు

బుద్ధిని శుద్ధిగా ఉపయోగించు,
జీవనాన్ని లక్ష్యంతో సాగించు

భగవంతునిపై భారం ఉంచు,
బాధ్యతలను తప్పక నెరవేర్చు

కృషితో గమ్యాన్నిసాధించు,
ఫలితం దైవానికి సమర్పించు

ఆత్మను లోతుగా శోధించు,
పరమాత్మను ఆత్మతో దర్శించు

***

నూతిలోని కప్ప

ఊరు వాడ తిరగనోడు
ఊరు ఎప్పుడు వదలనోడు
తాత వదిలిన ఆస్తితోటి
తండ్రి ఇచ్చిన సొమ్ముతోటి

తనకు తాను మురిసిపోతూ
మీసాలు దువ్వుకుంటూ
రోషాలు వెదజల్లుతూ
దౌర్జన్యం సాగిస్తూ

నూతిలోని కప్పలాగ
చెట్టులోని పురుగులాగ
గంప కింద కోడిలాగ
కొండమీద కోతిలాగ

తన శక్తితో తాను బ్రతకనోడు.
ఇతరులతో చేయి కలపనోడు
తల్లి కడుపు చెడగొట్టగ
పుట్టుట ఎందుకు దండగ

***

6

తత్త్వం - వేదాంతం

నాటకం – జగన్నాటకం

ఈ జీవితమంతా ఒక బూటకం
విధాత లిఖించిన విచిత్ర కథనం

జగన్నాటక సూత్రధారి దర్శకత్వం
నటరాజు సమకూర్చిన నృత్యం

జగమంతా ఓ పెద్ద రంగస్థలం
జరుగుతున్నదంతా అంతులేని నాటకం

మన మంతా పాత్రధారులం
పాత్ర ఏదైనా చెయ్యాలి న్యాయం

మనకి లేదు ఎంచుకొనే స్వాతంత్ర్యం
పాత్ర అయిపోతే వెళ్లాల్సిందే తెర వెనక్కి

నాయకుడైనా గాయకుడైనా
ఉన్నవాడయినా లేనివాడయినా

జీవితంలో ఎన్నో బంధాలు
పెంచుకున్న అనుబంధాలు

కాలం ముగిశాక ఎవరైనా
వెళ్లాల్సిందే అన్నీ వదులుకొని

జనన మరణాల మధ్య
జరిగే పెద్ద ఆటే జీవితమంటే

నచ్చినా నచ్చక పోయినా
ఆడాల్సిందే ఆట అంతం వరకూ

***

సూక్తి

మూర్ఖత్వానికి మందు లేదు
తెలివితేటలకు తరుగు లేదు

***

ఏమిటి వీటి ఉపయోగం?

వర్షించని మేఘం
జీతం లేని ఉద్యోగం
ఉప్పు లేని భోజనం
సాయానికి రాని స్నేహం
అవసరానికి పనికిరాని ధనం
ఏమిటి వీటి ఉపయోగం

***

తిరుగుతోంది భూగోళం

తిరుగుతోంది భూగోళం
కదులుతోంది కాలచక్రం

ఒకచోట సూర్యోదయం
మరొక చోట అస్తమయం

పగటి పూట కాంతిమయం
కాని తప్పదు సూర్యుని తాపం

రాత్రి పూట అంతా అంధకారం
కాని ఉంటుంది ఎంతో ఆహ్లాదం

కాలం కలిసి వస్తే సుఖం
కాలం కాటు వేస్తే దుఃఖం

ఒకరి జీవితం ఆనందమయం
మరొకరికి దుఃఖం ఆ సమయం

పగలు తప్పక అవుతుంది రాత్రి
రాత్రి తప్పక అవుతుంది పగలు

సుఖం ఎన్నడూ శాశ్వతం కాదు
దుఃఖం ఎప్పుడూ ఉండబోదు

కాల గమనానికి కావాల్సిందే
సుఖ దుఃఖాలు తారుమారు

సూర్య భ్రమణానికి రావాల్సిందే
రాత్రి పగలు తప్పక ప్రతిరోజు

మనిషికి శక్తి కావాలంటే
సూర్యరశ్మి తగలాల్సిందే

మనస్సుకు విశ్రాంతి కావాలంటే
సూర్యుడు అస్తమించాల్సిందే

ఆకాశం అందం ఆస్వాదించాలంటే
రాత్రికై ఎదురు చూడాల్సిందే

మనిషి విజయం సాధించాలంటే
కష్టాలు ఎదుర్కొని తీరాల్సిందే

తెల్లవారితే తారలు మాయం
రాత్రి అయితే మెరుపులు ఖాయం

మారుతూ ఉంటుంది కాలం
కాలంతోటే మన జీవన గమనం

అపగలమా ఈ కాలగమనం
ఆగదు ఎప్పుడూ కాలచక్రం

నిన్న అనేది తిరిగిరాని గతం
నేడు అనేది జరుగుతున్న నిజం

రేపు అనేది ఊహించే స్వప్నం
జీవించాలి ఆనందంగా ప్రతీ క్షణం

***

ఆశ - ఆనందం

ఆశ మరీ ఎక్కువైతే
ఆనందం మాయం అవుతుంది
మనస్సును అదుపులో ఉంచితే
జీవితంలో శాంతి దొరుకుతుంది

***

కాల మహిమ

ప్రతీ ప్రశ్నకుఉంటుంది తప్పక **సమాధానం**
అది ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి, ఎలా
తెలుస్తుంది అనేది అసలు సమస్య
అంటే ప్రశ్నకు సమాధానం తెలుసుకోవడం సమస్య

ప్రతీ సమస్యకుఉంటుంది పరిష్కారం
అది ఎప్పుడు,ఎక్కడ,ఎవరికి,ఎలా
దొరుకుతుంది అనేది అసలు ప్రశ్న
అంటే సమస్యకు పరిష్కారం దొరకడం ప్రశ్న

కాని

కాలం అన్ని ప్రశ్నలకు **సమాధానం** చెపుతుంది.
కాలం అన్ని సమస్యలకు **పరిష్కారం** చూపిస్తుంది.
కాలం తన మాయతో విశ్వాన్ని సృష్టిస్తుంది.
కాలం మరల తనలో విశ్వాన్ని కలుపుకుంటుంది.

కాలం సత్యం
కాలం నిత్యం
కాలం అనంతం
కాలం దైవం

***

కేలెండర్ లో ఆఖరి పేజీ

కేలెండర్ లో ఆఖరిపేజీ, చూస్తూ ఆలోచిస్తున్నా
గత సంవత్సరపు అనుభవాలు, నెమరు వేస్తున్నా
కాల చక్రాన్ని ఎన్నడూ ఆపలేం
గడచిన కాలాన్ని తిరిగి తీసుకు రాలేం

చేయాలి అనుకున్నది, వెంటనే చేసెయ్యాలి
వదలాలి అనుకున్నది, వెంటనే వదిలేయాలి
కాలం ఎన్నడూ ఆగదు నీ కోసం
నువ్వే ముందుకు సాగాలి ప్రతి క్షణం

గతి గమనం గమ్యం లేని జీవన విధానం
ఉంటే ఈ జన్మను నిరర్ధకం చేసినట్లే కదా మనం
ప్రతి సంవత్సరం బేరీజు వేయాలి తప్పక
ఈ కాలంలో సాధించిన మన అనుభవాల పట్టిక

గడచిన సంవత్సరాలలో గడించిన అనుభవ సారం
రాబోయే సంవత్సరాలకి అవుతుంది మార్గదర్శకం
కొత్త సంవత్సరం వచ్చిందని ఎందుకు ఉత్త సంబరం
మంచి పనులతో చెయ్యి కొత్త సంవత్సరానికి ప్రారంభం

***

కొత్త కేలండర్

పాత సంవత్సరం గడిచి పోయింది
కొత్త సంవత్సరం పుట్టుకు వచ్చింది

నిన్న కేలండర్ లో ఆఖరి పేజీ
ఈ రోజు కొత్త కేలండర్ లో మొదటి పేజీ

రోజులు కాల గర్భంలో కలిసి పోతుంటాయి
కొత్త సంవత్సరాలు వస్తూనే ఉంటాయి

ప్రయాణం చేస్తుంటే
మైలు రాళ్ళు దాటుతుంటే

గమ్యానికి చేరువ అవుతాం
మన వాళ్ళకు దగ్గర అవుతాం

సంవత్సరాలు గడుస్తూ ఉంటే
కేలండర్లు మారుతూ ఉంటే

ఎందుకు మనకి ఈ ఉత్సాహం?
దగ్గరవుతోంది కదా అంతిమ గమ్యం!

***

ఎందుకు వస్తుంది కోపం?

ప్రేమించిన అమ్మాయికి
మరి ఒకడితో పెళ్ళైతే ప్రియుడుకి కోపం
ఆ పెళ్లిని ఆపలేని
ప్రియుడి పై వస్తుంది ఆ ప్రేయసికి కోపం
ప్రేమించేటప్పుడులా లేడని
పెళ్ళాంగా మారిన ప్రేయసికి కోపం
బాధ్యతలు తట్టుకోలేక
మొగుడిగా మారిన ప్రియుడికి కోపం
పసివాడు పాలకోసం ఏడిస్తే
వాట్సప్ చూస్తున్న తల్లికి కోపం
కుర్రాడు ఏమైనా సందేహం
అడిగితే తెలియని తండ్రికి కోపం
భర్తను అడిగితే నగలు
కొనలేదని భార్యకు వస్తుంది కోపం
భార్య కోరికలు పెరిగిపోతున్నాయని
భర్తకు వస్తుంది కోపం
మొగుడు ఇంటి విషయం
పట్టించుకోడని పెళ్ళానికి కోపం
పెళ్ళాం ఎప్పుడూ
సతాయిస్తుంది అని మొగుడికి కోపం

కోడలు తనకు నచ్చినట్లు
చేయదని అత్తగారికి ఎంతో కోపం
అత్తగారు తనమీద
అజమాయిషీ చేస్తుందని కోడలుకి కోపం
చుట్టాలువచ్చి తిష్టవేసారని
ఇంటావిడకి కోపం
తనకు చీరైనా పెట్టలేదని
వచ్చిన చుట్టానికి కోపం
అడిగినా లంచం ఇవ్వలేదని
లంచగొండి అధికారికి కోపం
అటువంటి ఉద్యోగం తనకెందుకు
రాలేదని అభ్యర్థికి కోపం
తోటివాడు సంపాదించి
బాగుపడితే అసూయతో కోపం
తన పొరుగువాడికి అదృష్టం
కలిసి వస్తే ఈర్ష్యతో కోపం
ఎవడైనా మోసగిస్తే తన
తెలివి తక్కువతనానికి కోపం
తక్కువ మార్కులు వచ్చినవాడికి సీటొస్తే
సీటురాని విద్యార్థికి కోపం
తన అధికారం అంతమయ్యిందని
విశ్రాంత ఉద్యోగికి కోపం

తనను ఎవరు పట్టించుకోవడం లేదని
వయోవృద్ధుడికి కోపం
పేదవాడు బాగుపడితే
అసూయతో ధనికుడికి కోపం
చేతకాని మధ్య తరగతి
వాడికి తనమీద తనకే కోపం
ఎదగలేక సమాజం మీద
వస్తుంది సామాన్యుడికి కోపం
దోపిడీదారులు నాయకులుగా
గెలుస్తారని ప్రజలకు కోపం
మన తప్పులు ఎవరైనా
ఎత్తి చూపిస్తే వస్తుంది మనకి కోపం
ఎదుట వాళ్ళు తప్పుని ఒప్పుకోక
పోయినా వస్తుంది మనకి కోపం
తను అనుకున్నట్టు జరగక పోతే
ఎవరికైనా వస్తుంది కోపం
కృషి తక్కువై కోరికలు ఎక్కువైతే
ఎప్పుడూ ఉంటుంది కోపం

***

కోపానికి కారణాలు?

తీరని కోరికలతో కోపం,
అసహాయతతో కోపం
అసంతృప్తి తో కోపం
అహం పెరిగితే కోపం
అసహనంతో కోపం
అసూయతో కోపం
అపార్థంతో కోపం
భయంతో కోపం
మోహంతో కోపం
కామంతో కోపం
స్వార్ధంతో కోపం
ఈర్ష్యతో కోపం

***

కర్మ ఫలం

ప్రతిఫలం ఆశించి ఎన్నడూ కర్మలు చేయకు
ప్రతిఫలం ఉండదని ఎప్పుడూ కర్మలుమానకు
కర్మలు చేయడం వరకే నీకు ఉంది అధికారం
కర్మ ఫలంతో ఏమీ లేదు నీకు సంబంధం

కర్మలు చేయాలనే ఆసక్తి చూపకుండ
కర్మలు చేయటంపై అనాసక్తి లేకుండ
కర్మలు చేస్తూ స్వధర్మాన్ని పాటించడం
కర్మ యోగులకు అతి ముఖ్య లక్షణం

***

సుఖం- దుఃఖం

దుఃఖం వస్తే కృంగిపోకు
సుఖం వస్తే పొంగిపోకు

కోరికలను దూరంపెట్టు
రాగద్వేషాలు వదలిపెట్టు

ఆత్మానందం అనుభవించు
స్థితప్రజ్ఞుడిగా మార్పుచెందు

***

కోరిక

కోరికల మీద మమకారం
కోరిక తీరితే అహంకారం
కోరిక తీరకపోతే వస్తుంది క్రోధం
కోరిక తెస్తుంది చివరకు సర్వనాశనం

***

చేదు - చెడు

కాకరకాయ కూర చేదు తగ్గాలంటే
మూకుడులో వేసి వేయించాల్సిందే
మనిషి చెడు ఆలోచనలు పోవాలంటే
మంచిగా దేహశుద్ధి చేయాల్సిందే!

ఉన్నా – లేకున్నా

లేనివాడికి ఆకలి దప్పులు
ఉన్నవాడికి అరగక తిప్పలు
ఉన్నా లేకున్నా ఎప్పుడు
మనిషికి బాధలు తప్పవు

ఒక నీతి మాట

నీ వెన్ను తట్టే వందమంది మిత్రులకన్నా
నీ ఉన్నతికి ఓర్వలేనివా డొక్కడుంటె చాలు
నీ పట్టుదల పదిరెట్లు పెరుగుట నిశ్చయంబు
నీ ప్రతిభ ప్రకాశించుట తధ్యము ఆ క్షణంబు

విశ్వం

విశ్వంలో లేనిది లేదు
విశ్వం బయట ఏమీ లేదు
విశ్వానికి పుట్టుక లేదు
విశ్వానికి అంతం అసలే లేదు

***

ఆత్మకు విడుదల

కాలం ముందుకు సాగుతుంటే
వయస్సు మీద పడుతుంటే
శరీరం శిధిలం అయిపోతుంటే
ఆత్మకు విడుదల వచ్చినట్టే!

***

7

సమాజం - ప్రపంచం

దేశమును ప్రేమించు

దేశమును ప్రేమించు
దేశ ఉన్నతిని కాంక్షించు

తోటి ప్రజలకు ప్రేమ పంచు
దేశాభివృద్ధికి సహకరించు

కులమతాలను మరచి పోయి
అందరము కలిసి మెలిసి

సమిష్టిగా మనముంటే
శత్రువుల ధైర్యం సన్నగిల్లదా

ఆటల్లో పాటల్లో అన్నిట్లో
మన దేశానికి పేరు తెద్దాం

దేశ ప్రగతిని పెంచుకుందాం
మన దేశ భక్తిని చాటుకుందాం

***

ఓ నాయకుడి స్వగతం

గాంధీ గారు అంటే నాకెంతో భక్తి
వారి ఆశయాలంటే లేదు నాకు ఆసక్తి

వారు తెచ్చారు మనకి స్వాతంత్ర్యం
అందుకే కదా వచ్చింది ప్రజాతంత్రం

జరుపుతాను వారి జయంతి వర్ధంతి
వేస్తాను మెడలో పూలదండ పెద్దది

కొంటాను తప్పక ఎన్నైనా ఓట్లు
ఖర్చు అయిపోయినా నా దగ్గరున్న నోట్లు

ప్రజలంటే కూడా నాకు చాలా ఇష్టం
ఎదుగుదలకి అవుసరం వారి కష్టం

***

ప్రకృతి కొచ్చిన కోపం

చెట్లన్నీ కొట్టేసి, కాలవలను పూడ్చేసి
చెరువులను ఆక్రమించి, మేడ మీద మేడ కట్టి

ప్రకృతిని పాడు చేస్తూ
మనిషి ముందు కెళ్తుంటే

ప్రకృతికి కోపమొచ్చి, ఒక్కరోజు వర్షానికి
రోడ్డులన్ని యేరులయ్యి, వాహనాలు కొట్టుకుపోయి

స్థంభాలు వరిగిపోయి, వాడలన్నీ మునిగిపోయి
ఊరంతా చెరువయ్యి, మనిషి బ్రతుకు చెదిరిపోయె

సమతుల్యత పాటిస్తూ, ప్రకృతిని ప్రేమిస్తూ
వనరులను పరిమితంగావాడుకుంటూ జీవిస్తే

ప్రకృతి శాంతంగా ఉండదా?
మనిషి మనుగడ బాగుపడదా?

***

కరోనా కల్లోలం

కరోనా అని వింటే భయం
మనస్సులో ఎంతో కలవరం
కరోనా తెచ్చిన విలయం
ప్రపంచానికి ఇది పరీక్షా సమయం
స్కూళ్ళూ కాలేజీలూ లేవు
ఉద్యోగాలూ వ్యాపారాలూ లేవు
గుళ్ళూ తీర్థయాత్రలూ లేవు
ఏ ఇంట్లోనూ కేరింతలూ లేవు
రోడ్డు మీద వాహనాల గోలా లేదు
బజారులో జనాల సందడీ లేదు
షికార్లు సినీమా హాళ్ళు అసలే లేవు
స్నేహితుల చుట్టాల చూపులే లేవు
కళ్ళలోన కాంతి లేదు
మనసుకి శాంతి లేదు
రోగానికి మందు లేదు
రోగికైతే బెడ్డు లేదు
పగటి పూట పని లేదు
రాత్రి పూట నిద్ర రాదు
పగటికీ రాత్రికీ తేడా లేదు
బతుకులో తీపి లేదు

ఈ కరోనాకు అంతమెపుడు
బతుకు మరల బాగుండే దెపుడు
జీవితం ఆనందంతో నిండే దెపుడు
అందరితో హాయిగా నవ్వే దెపుడు
ప్రయోగంలో జరిగిన ప్రమాదమా
మనిషి సృష్టించిన విధ్వంసమా
ప్రకృతి కొచ్చిన కోపమా
దేవుడు ఇచ్చిన శాపమా
రావాలి ఈ రోగానికి విరుగుడు
ఉంటాడు ఎవరో ఓ మహనీయుడు
అవుతాడు అందరికీ రక్షకుడు
అంటారు ఆయన్ని దేవుడు
తప్పక పడుతుంది ముందడుగు
వస్తాది మనకు ఏదో ఒక గొడుగు
దూరాన ఎక్కడో చిన్న ఆశాజ్యోతి
త్వరలోనే అవ్వాలి అది సూర్యకాంతి
వచ్చేస్తోంది ఆక్సఫర్డ్ వాక్సిన్
లేదంటే ఇండియా కోవాక్సిన్
అంత వరకూ ఉండాలి మనం
జాగ్రత్తలు పాటిస్తూ దూరం దూరం

***

ప్రాణమున్న ఓ మానవుడా!

ఓ ప్రాణిని హింసించి
దాని పీక నరికేసి
ముక్కలుగ కోసేసి
మసాలాతో దట్టించి
మంటల్లో కాల్చేసి
మందుతో కలిపికొట్టి
విందు చేసుకొనేహక్కు
ఎవరు ఇచ్చారునీకు?
ఆ జంతువులు అన్ని వచ్చి
ఓ మనిషిని పట్టుకొని
ఈడ్చుకుంటూ తీసుకెళ్ళి
పొట్టంతా చీల్చేసి
ఆవురావురుమని తింటేను
మనిషి కెలాగుంటాది?
మనసు పెట్టి ఒక్కసారి
ఆలోచన చేసి చూడు!
ప్రాణమున్న ప్రాణి యొక్క
ప్రాణాలతో ఆడుకొని

ప్రాణం తీసే హక్కు
ఎవరు ఇచ్చారు నీకు?
ప్రాణమున్న మానవుడా!
సాటి ప్రాణుల బ్రతుకనివ్వు
జీవహింస వదలిపెట్టు
అహింసను పాటించు
ఆకలి అయితే తినడానికి
చెట్టు మీద కాయల్లేవా?
చేలల్లో పంట లేదా?
ఆకులలములు ఏమిలేవా?
దుంపలు అయినా దొరకలేదా?
పండించను రైతు లేడా?
దుర్మార్గం వదలి పెట్టు
సాత్విక జీవనం మొదలుపెట్టు

***.

ఓటు - ఓటరు

ఓటు వేయని ఓటర్లు
సమాజానికి చీడపురుగులు

ప్రజాస్వామ్యం అర్థం తెలియని
పశువుల లాంటి మనుషులు

చదువుకున్న చవటల కంటే
చదువు లేని పౌరుడు నయం

పట్నంలో ప్రజల కంటే
పల్లె లోని జనం నయం

ఓటు కూడా వేయలేని నీకు
ఎందుకురా ప్రశ్నించే అధికారం?

***

ఆగండి! ఆలోచించండి!

ఆగండి! ఆలోచించండి!
అందరూ ఆరోగ్యంగా ఉండండి!

ఆపండి! అనుమతించకండి!
అనవసరమైన గుంపుల్ని!

మగవాళ్ళ మందు పార్టీలు
ఆడవాళ్ళ కిట్టీ పార్టీలు

పిల్లల పుట్టినరోజు పార్టీలు
పెద్దల పెళ్ళిరోజు పార్టీలు

నాయకుల ఎలక్షన్ మీటింగులు
పనిలేనివారి పార్కు మీటింగులు

భక్తుల కుంభ మేళాలు
కుర్రకారు వీధి షికార్లు

జాగ్రత్తలు తీసుకున్నా
వస్తుందేమోనని భయపడి చస్తుంటే!

విచ్చలవిడిగా తిరిగితే
వైరస్ రాకుండా ఉంటుందా?

అవసరానికి వెళ్ళడం తప్పనిసరి
అవసరం లేకుండా వెళ్లకండి మరి

ఈ ప్రకృతి విపత్తు ఎదుర్కోవాలంటే
ఈ వైరస్ మహమ్మారిని అడ్డుకోవాలంటే

నువ్వైనా! నేనైనా! ప్రభుత్వమైనా! విపక్షమైనా!
మిత్రులైనా! శత్రువులైనా! అందరూ ఏకమై!

ఒకే మాటపై నిలవాలి, ఒకే బాటలో నడవాలి
ఒకరికి ఒకరు తోడుండాలి, సాయం చేయాలి

ఆగండి! ఆలోచించండి!
అందరూ ఆరోగ్యంగా ఉండండి!

ఆపండి! అనుమతించకండి!
అనవసరమైన గుంపుల్ని!

***

మన బాధ్యత

కనపడని 'వైరస్' అన్నా,
కనిపించే 'వాక్సిన్' అయినా,

ఆ పరమాత్ముడి సృష్టియే
మనకు పెట్టిన పరీక్షయే!

మన బాధ్యత నెరవేర్చి
'పాస్' అవుతామా?

మన బాధ్యత విడిచిపెట్టి
'ఫెయిల్' అవుతామా?

భయం వద్దు! భయం వద్దు!
బాధ్యత మాత్రం మరువ వద్దు

మనం అందరం ప్రయత్నిస్తే
ఆ దేవుడు దయతలిస్తే

మంచి రోజులు మరల వస్తాయి
మన మనస్సులు తేలిక అవుతాయి

***

నేను కూడా రైతునే

ఉద్యోగం చేసాను
        డబ్బు సంపాదించేను
వ్యాపారం చేసాను
        ఆస్తులు కూడ పెట్టాను
భూములు ఎన్నో కొన్నాను
        కౌలుకు అన్నీ ఇచ్చాను
పట్నంలోనే ఉంటాను
        పొలానికి వెళ్ళనే వెళ్ళను
రాయితీలు తీసుకుంటా
        ప్రోత్సాహకాలు పొందుతుంటా
కౌలు డబ్బును వదల కుండా
        పన్ను కూడా కట్టకుండా
ఇనప్పెట్టె నిండుతు ఉంటే
        భూమి విలువ పెరుగుతు ఉంటే
నేను కూడా రైతునే
        నా దేశానికి వెన్నుముకనే

***

పలాయన మంత్రం

పలాయన మంత్రం,
ఆధునిక జీవన విధానం!

బాధ్యతలను మరచిపోయిన ప్రజలు,
ప్రస్తుత సమాజానికి ప్రతిబింబం!

పేదవాడి గుడిసెలను కూలగొడితే నాకెందుకు?
బీదవాడు బ్రతకలేక ఏడిస్తే నాకెందుకు?

పొరుగువాడిని ఎవడో వచ్చి పొడిచేస్తే నాకెందుకు?
అపరిచితుడు రోడ్డుపక్కన పడిపోతే నాకెందుకు?

రౌడీ వెదవ ఆడపిల్లల్ని ఏడిపిస్తే నాకెందుకు?
వరదలు వచ్చి వాడలన్నీ మునిగిపోతే నాకెందుకు?

ప్రజలు అంతా రోగాలతో అలమటిస్తే నాకెందుకు?
దళారీలు ప్రజల శ్రమను కాజేస్తే నాకెందుకు?

ఫీజులు చార్జీలు పెంచి దోచేస్తే నాకెందుకు?
ఎన్నికల్లో ఎవరు గెలిస్తే నాకెందుకు?

ప్రభుత్వాలు ప్రజాధనం పాడుచేస్తే నాకెందుకు?
శత్రువు వచ్చి సరిహద్దులు ఆక్రమిస్తే నాకెందుకు?

నాకెందుకు? నాకెందుకు?
ఈ ఆలోచన మారేదెప్పుడు?

మానవత్వం మెరిసే దెప్పుడు?
మనిషి స్వార్థం తగ్గే దెప్పుడు?

స్వార్థంతో కొద్ది మంది, భయంతో పెక్కు మంది
నాకెందుకు? అనుకుంటూ బ్రతుకుతుంటే!

మార్పు కోసం మనం ప్రయత్నం చెయ్యాలా?
ఎవరో వస్తారని ఎదురు చూస్తూ కూర్చోవాలా?

***

న్యాయం

సూరీడుని మేఘాలు చుట్టేస్తే,
గ్రహణం నాడు రాహువు మింగేస్తే

పట్టపగలు వెలుగు అంతరిస్తుంది,
చుట్టూ చీకటి అలుము కుంటుంది

'అన్యాయం' అనే పదానికి అస్థిత్వం లేదు
'న్యాయం' జరగక పోవడమే 'అన్యాయం'

రెచ్చిపోయిన రాక్షసులు,
దురాశా పిశాచాలు

ధర్మదేవత కళ్ళు కప్పేసి
న్యాయం కాళ్ళూ చేతులు కట్టేసి

స్వార్థం అనే సముద్రం మధ్యన,
పాపాల పిశాచాల దీవిలోన

అవినీతి అలముకున్న అడవిలోన
దుర్మార్గపు చీకటి గుహలోన

దౌర్జన్యం అనే సంకెళ్ళతో
కట్టేసి బందీగా చెరపడితే

అర్థం కాని అమాయకపు ప్రజలు
న్యాయం ఎక్కడా కనపడక

వెతికి వెతికి వేసారి విలపించి
ఎప్పుడో ఎవడో ఒకడొచ్చి

న్యాయాన్ని వెదకి తెస్తాడని
నిద్రపోతూ కలలుకంటు ఉంటే!

ఆ ప్రజల ఆశ ఎప్పుడైనా తీరేనా?
న్యాయం తిరిగొచ్చి మరల నాట్యం చేసేనా?

***

మాతృభాష

నీవెన్ని భాషలు నేర్చినా
నీవెన్ని దేశాలు తిరిగినా
మధురమైన తెలుగు భాష
మరచి పోకు మిత్రమా!

***

మేలుకోరా తెలుగోడా!

నిరాశా వాదంతో
నిశ్శబ్దపు నీడలో
నువ్వు ఎన్నాళ్ళని దాక్కుని ఉంటావు
నీలో నువ్వే గొణుక్కుంటూ ఉంటావు
నీరసాన్ని అధిగమించి
వీర రసం వెలికి తెచ్చి
పౌరుషాన్ని ప్రదర్శించి
ప్రగతి పథంలో పురోగమించు
శాతవాహనుల శౌర్యము
కాకతీయుల కార్యసాధన
రాయలవారి విజయగాథ
పలనాటి పౌరుషము
గజపతుల ధాతృత్వము
వెలమ దొరల వీరత్వం
రెడ్డిరాజుల నాయకత్వం
ప్రజలందరి ఐకమత్యం
మునుపటి రోజుల గొప్పతనం
మరచి పోయిన తెలుగోడా
మొద్దు నిద్ర లేవరా
మరల గమ్యం సాధించరా!

రామరాజ్యం

ప్రజల సంక్షేమం కోరే
పరిపాలనా దక్షత ఉన్న రాజు

ఎంతటి సమస్యకైనా
పరిష్కారం చెప్పగలిగే మంత్రి మండలి

ఎల్ల వేళలా సంసిద్ధంగా ఉండే
శత్రు భయంకరుడైన సేనాధిపతి

రాజాజ్ఞను పాటిస్తూ
ప్రజల కోసం పనిచేసే ఉద్యోగులు

బంజరు భూమిని సైతం
సారవంతంగా మార్చే కర్షకులు

కష్టమైన పని నైనా
ఏంతో ఇష్టంగా చేసే కార్మికులు

న్యాయమైన లాభార్జన కోసం
వాణిజ్యం చేసే వ్యాపారస్తులు

అదే కదా ఆనాటి రామరాజ్యం
మరల వస్తుందా అంతటి సుదినం

ప్రజల కష్టాలు పట్టించుకోని రాజు
బుద్ధి హీనులైన మంత్రులు

అవినీతిలో మునిగిన అధికారులున్న
ప్రజలగతి అధోగతియే గదరా రామా!

***

పిల్లి మెడలో గంట

పండించే రైతుకు గిట్టు బాటు ధర రాదు
ప్రజలకు మాత్రం ధరలలో వెసులుబాటు లేదు

రాజకీయ నాయకులుకథలు ఎన్నో చెప్తారు
దళారీలు ధరలను పెంచుకుంటూ పోతారు

సామాన్యులు తమ కర్మకి తిట్టుకుంటూ ఉంటారు
పిల్లి మెడలో గంట ఎవరు కడతారు?

***

నేను వేరే – నువ్వు వేరే

నేను వేరే నువ్వు వేరే
నీ కులం వేరు నీ మతం వేరు

నీ ఊరు వేరు నీ వాడ వేరు
అంటూ మనుషులు కొందరు

బుద్ధి లేక మనస్సు లేక
తిట్టుకుంటు కొట్టుకుంటు

తన్నుకుంటు పొడుచుకుంటు
తారతమ్యాలు ఎంచుకుంటు

ఒకరిని ఇంకొకరు ద్వేషిస్తూ
బ్రతుకు గడుపుతూ ఉంటె

మృగాలు కూడా వారిని చూసి
పకపక మని నవ్వి పోవ!

రాష్ట్రాలను ప్రాంతాలను
ఊళ్ళను వాడలను

కులాలను మతాలను
కుటుంబాలను సోదరులను

బంధువులను స్నేహితులను
ప్రతి మనిషిని విడదీసి

పంచుకుంటూ తింటున్న రాక్షసులు
కొంత మంది ప్రజా నాయకులు

ద్వాపరంలో శ్రీకృష్ణుడు
పెక్కుమంది రాక్షసులను

మట్టు పెట్టి మార్పు తెచ్చి
ధర్మ సంస్థాపన చేయలేదా!

మనం ఉన్న ఈ కలియుగంలో
ఈ రాక్షసులను సంహరింప

ఎంతమంది శ్రీకృష్ణులు
అవతరించ వలెనో కదా!

***

అసలు రైతు ఎవడు?

అసలు రైతంటే ఎవడు!
అందరూ రైతులే! పండించేది మాత్రం కొందరే!
భూమి ఉన్న ప్రతీవాడు రైతేనా?
రైతుకు న్యాయం జరగేది ఎప్పుడు?

రెక్కలొడ్డి రాతిని మట్టిగా చేసేవాడు
మట్టిలో బ్రతుకును ఈడ్చేవాడు
నాగలి పట్టి కండలుకరిగించి దున్నేవాడు
శ్రమించి విత్తును పంటగా మార్చేవాడు

కంటికి రెప్పలా పంటను కాచేవాడు
కంటికి సరిపడ నిద్దర లేనివాడు
శ్రమించి వ్యవసాయం చేసేవాడు
ప్రజల ఆకలిని తీర్చేవాడు

భూమి అసలు లేని కౌలు రైతులు
బ్రతుకు భారమైన సన్నకారు రైతులు
తమ చెమటను పంటగా మారుస్తూ
బ్రతుకు భారంగా ఈడ్చుకుంటూ

తమ కర్మకు తిట్టుకుంటు, ఆత్మహత్యలు చేసుకుంటే
బడా బడా భూస్వాములు, ఉద్యోగులు, వ్యాపారులు
భూములను కొనేసి వాటిని కౌలుకి ఇచ్చేసి
పల్లెలను వదిలేసి పట్నాలు చేరిపోయి

వడ్డీలు గుంజుకుంటు, ఇనప్పెట్టె నింపుకుంటు
ఆస్తులను పెంచుకుంటూ, స్వార్థంతో
మేమే రైతులమని రైతు నాయకులమని
ప్రోత్సాహకాలు రాయితీలు అందుకుంటే

రైతు కష్టానికి కండలు కరిగి పోయినా
రైతుకు రాబడి రాక పోయినా
రైతునని చెప్పుకొనే భూస్వామికి
రాబడితో బాటు ఎన్నెన్నో మినహాయింపులు

గ్రామాన్ని వదిలి పెట్టి పొలాన్ని కౌలుకిచ్చి
పట్నంలో ఉండేవాడు రైతు ఎలాగవుతాడు?
రాయితీలెందుకు? ప్రోత్సాహకా లెందుకు?
రాబడి పన్ను పైన మినహాయింపు ఎందుకు?

భూమి కౌలు కిచ్చినా, ఇల్లు అద్దె కిచ్చినా
వ్యాపారం చేస్తున్నా, ఉద్యోగంలో ఉన్నా
ప్రాక్టీస్ చేస్తున్నా, పరిశ్రమలు పెట్టినా
అన్నీ ఆదాయపు మార్గాలే కదా!

***

ఆ నాడు - ఈ నాడు

1. ఆ రోజుల్లో

స్వాతంత్ర్యం రాకముందు, పోరాటం రోజుల్లో
స్వరాజ్యం వచ్చాక, సొంత నడకలు నేర్చేటప్పుడు

ప్రపంచ యుద్ధం తెచ్చిన దారిద్ర్యం
పరపీడనతో వచ్చిన అపార నష్టం

కరువు కాటకాలతో ప్రజలు విలవిల లాడేటప్పుడు
ప్రజల బాధలు పంచుకొని, స్వార్థాన్ని వదలుకొని

జాలి గుండెఉన్నవారు, ప్రజల కష్టం తెలిసినవారు
గుండెల్లో పెట్టుకున్నగొప్ప నాయకులు

ఊరికి ఒక్కడైన ఉండేవాడు, ఎంతో మేలు చేసేవాడు
రాయవరం రాముడైనా, కోడూరుకృష్ణుడైనా

గ్రామాలు ఏవైనా,వారి నామాలు ఏవైనా
అందరికీ సాయపడే మనసున్న మహారాజులు

ఆకాశపు అంచు అంత, సముద్రపు లోతు అంత
హృదయం ఉన్నవాళ్ళు, ఎంతోమంది ఉండేవాళ్ళు

అవసరాలు తక్కువ, ఆప్యాయతలు ఎక్కువ
ఒకరి గుండె చప్పుడు, ఇంకొకరికి తెలిసేది

ఒకరి గుండె ఆగితే, అందరూ ఏడ్చేది
కష్టసుఖాల్లో పాలు పంచుకొనేది

2. ఈ రోజుల్లో

స్వాతంత్ర్య దేశంలో, ముందడుగు పడ్డాక
పరిశ్రమలు వచ్చాక, పనులు దొరికాక

అభివృద్ధి బాటలో ముందుకు నడిచాక
సంపద పెరిగింది, సౌకర్యాలు పెరిగాయి

అలవాట్లు మారాయి, అవసరాలు పెరిగాయి
స్వార్థం సముద్రమంత అయ్యింది

దోపిడీ దానితో పాటుమొదలైంది
అసూయ పెరిగింది, అసహనం తోడు అయ్యింది

విలాసాలు పెరిగాయి, వ్యసనాలు ముదిరాయి
ఆశ కొండంత అయ్యింది అది దురాశగా మారింది

మాయం అయ్యారు మహానుభావులు
అదృశ్యం అయ్యారు ఆ ప్రజా నాయకులు

ఊరికి ఒక్కడైనా ఉన్నాడు
ప్రజలను పీడించే దుర్మార్గుడు

ప్రజల ఆస్తులు కాజేసే బకాసురుడు
కామాంధుడైన కీచకుడు

పురాణాలు చదువుతాం, పూజలను చేస్తాం
నీతి కథలు చెప్పుకుంటు ఉంటాం

నీతి సూత్రాలను నీళ్ళకి వదిలేస్తాం
విధ్య వైద్యం ఉద్యోగం వ్యాపారం రాజకీయం

అన్నింటా అంతులేని అవినీతే
కలుషితమైన జీవన విధానమే.

3. ఆ రోజుల్లో - ఈ రోజుల్లో

ఒక్కపూట తిండిలేక బక్కచిక్కిన
శరీరాలతో కష్టించిన ఆ రోజులు

సుఖం ఎక్కువై వళ్ళు బలిసి
కదలలేక కూలబడిన ఈ రోజులు

లేనప్పుడు ఉన్నప్పుడు ఎప్పుడూ
మనిషే కదా తన కష్టాలకు మూలం.

ఎందరో మహిళలు

ఎందరో మహిళలు
ఉద్యోగులు గృహిణులు

మానవ జాతిలో వారి భాగం
ఉంటుంది రమారమి సగం

మనకు జన్మనిచ్చిన తల్లులు
మన తోడబుట్టిన తోబుట్టువులు

మన చేయి పట్టిన సతీ మణులు
మనం జన్మను ఇచ్చిన కుమార్తెలు

ఝాన్సీ రాణి లక్ష్మీబాయి
కాకతీయ రాణి రుద్రమదేవి

కరవాలము చేతపట్టి యుద్ధాలను చేయలేదా!
స్వాతంత్ర్య సమరంలో స్వతంత్ర భారతంలో

ఆధునిక ప్రపంచంలోఅన్ని రంగాలలో
అతివలు ఎందరో తమ ఉనికిని చాటలేదా!

విద్యఅయినా వైద్యమైనా
వైజ్ఞానిక పరిశోధనైనా

ప్రభుత్వ పరిపాలన అయినా
సంస్థల నిర్వహణ అయినా

నటనలో నాట్యములో
ఆటలలో పాటలలో అన్నింటిలో

తీసిపోరు పురుషులకు
ఎందులోనూ ఎప్పుడూ

గృహ నిర్వహణ లో
పిల్లల పెంపకం లో

వారి నైపుణ్యం ఎక్కువే
పురుషుల కంటే అధికులే

సృష్టి విస్తరణ జరగాలంటే
వంశం వృద్ధి చెందాలంటే

సుఖ సంతోషాలు ఉండాలంటే
అనుకున్నది సాధించాలంటే

ఉండాలి స్త్రీ పురుషుల అనుబంధం
సుఖమయ దాంపత్య యోగం

యుద్ధం! విధ్వంసం!

వనరులకోసం స్వార్థ ప్రయోజనాల కోసం
అమెరికాదేశ ప్రపంచ ఆధిపత్య ప్రణాళికలు
తమ వాటా కోసం గోతికాడ నక్కల్లాగ
కాచుకున్న పాశ్చాత్య దేశాలు
తమ ఉనికిని చాటుకునేందుకు
రష్యా జరుపుతున్న ఘోర మారణకాండ
జరిగేది చూస్తూ లోలోపల ఆనందిస్తూ
చైనా వేసే భవిష్యత్తు ఎత్తుగడలు
దయనీయమైన యూక్రెయిన్ పరిస్థితి
శ్మశానంగా మారిన సుందర దేశ స్థితి
గుట్టలు గుట్టలు శవాలు
లక్షల సంఖ్యలో కాందిశీకులు
ప్రకృతి వనరులకోసం కొట్టుకుంటు
ప్రకృతిని నాశనం చేసే సంపన్నదేశాలు
తటస్థంగా ఉంటేనే నీ మనుగడ సాధ్యమని
అగ్రదేశాల హెచ్చరిక ఇది మనందరికి

***

ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు?

నాతో కలిస్తే అండగా ఉంటాం అని
ఉసికొల్పిన అమెరికాదా!
మేము కూడా ఉన్నామని
చేతులెత్తేసిన ఐరోపా సమూహానిదా!
దూరపు కొండలు నునుపని
నమ్మి పక్కవాడితో అనవసరంగా
శతృత్వాన్ని కొని తెచ్చుకున్న
యూక్రేనియన్ ప్రభుత్వానిదా!
సైనికబలంతో ప్రజలను
శవాలుగా మారుస్తున్న రష్యాదా!
జరిగేది చూస్తూ మాటలతో
గడుపుతూన్న ప్రపంచ సమాజానిదా!
పరిస్థితికి తలవంచక చివరి వరకు
పోరాడుతున్న ఆ దేశ ప్రజలదా!
తప్పెవరిది? ఒప్పెవరిది?
ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు?

***

మంచు కొండలు

కరుగు తున్నాయి మంచుకొండలు
మునుగు తున్నాయి తీరప్రాంతాలు

గొప్ప వాడి గుండెల్లో మంచు పేరుకుంటోంది
లేని వాడి గుండె కరిగి సముద్రం అవుతోంది

ప్రకృతి లో వస్తున్నాయి పెను మార్పులు
మనిషిలో తెస్తున్నాయి వికృత భావాలు

ఒకప్పటి అధర్మ కృత్యాలు
ఇప్పుడు అయ్యాయి ధర్మ మార్గాలు

ధర్మానికి ఆయుష్షు కరిగి తరిగి పోయింది
నడవలేని ముసలితనం రానే వచ్చింది

అధర్మం యవ్వనంతో ఏపుగా పెరిగింది
అది ఎంతో అందంగా రూపు దిద్దుకుంది

కాలం మారుస్తుంది మన ఆలోచనా విధానం
కాలంతో మారుతుంది మనం జీవించే ప్రపంచం

పెరిగింది తరుగుతుంది తరిగింది పెరుగుతుంది
తరిగి పెరుగుతుంది పెరిగి తరుగుతుంది

విశ్వంలో జీవం నిర్జీవం ఏదీ కాదు శాశ్వతం
విశ్వం ఒక పెద్ద పడి లేచే కడలి తరంగం

***

ప్రజా వాక్కు

తన పదవిని ఉపయోగించి
ప్రజల శక్తిని, సంపదను దోచేసి
తను పురోగతిని సాధించేవాడిని
పెద్ద మనిషి అంటారు ప్రజలు

తన పదవికి న్యాయం చేసి
ప్రజల అభివృద్ధికి పాటుపడి
తను పేదవాడిగా మిగిలినవాడిని
పిచ్చివాడు అంటారు, అదే ప్రజలు

***

నూతిలోని కప్ప

ఊరు వాడ తిరగనోడు
ఊరు ఎప్పుడు వదలనోడు

తాత వదిలిన ఆస్తితోటి
తండ్రి ఇచ్చిన సొమ్ముతోటి

తనకు తాను మురిసిపోతూ
మీసాలు దువ్వుకుంటూ

రోషాలు వెదజల్లుతూ
దౌర్జన్యం సాగిస్తూ

నూతిలోని కప్పలాగ
చెట్టులోని పురుగులాగ

గంప కింద కోడిలాగ
కొండమీద కోతిలాగ

తన శక్తితో తాను బ్రతకనోడు.
ఇతరులతో చేయి కలపనోడు

తల్లి కడుపు చెడగొట్టగ
పుట్టుట ఎందుకు దండగ

కోరలు లేని రాక్షసులు

కోరలు లేని రాక్షసులు
కొల్లలు కొల్లలు కోకొల్లలు

వేలు లక్షలు కోట్లు
లెక్క లేనన్ని నోట్లు

వేస్తారు తెల్లటి ఇస్త్రీ బట్టలు
చిందిస్తారు పెదవిపై చిరునవ్వులు

పెడతారు నుదుటన బొట్టు నామాలు
తీస్తారు నీ వెనుక ఎన్నో గోతులు

బుర్రమీసాల రోజులు మారాయి
గళ్ళ లుంగీల రంగులు పోయాయి

మేక వన్నెల పులులు ఎన్నో
మన మధ్యన తిరుగుతు ఉన్నాయి

చూపులకు అచ్చం శ్రీరామచంద్రులు
చేష్టల్లో మాత్రం క్రూర రావణాసురులు

నిన్ను దోచుకుంటారు నీ దగ్గర ఉంటే
నీ చేత ఊడిగం చేయిస్తారు లేకుంటే

స్వార్థం అసూయ పదవీ వ్యామోహం
దోపిడీ దౌర్జన్యం దానవత్వం హింసాతత్వం

సర్వ మతధర్మాలకూ అతీతం
సొంత ఎదుగుదలే వారికి ముఖ్యం

***

రాజకీయం

రాజరికం పోయింది
ప్రజాస్వామ్యం వచ్చింది
రాజకీయ రణరంగం
ప్రజల మధ్య కొచ్చింది
వైషమ్యాలను పెంచింది
మనుష్యులను విడదీసింది

***

ఆజాదీ కా అమృత్

1. తొమ్మిది దశాబ్దాల స్వాతంత్ర్య సమరం

తొమ్మిది దశాబ్దాల సుదీర్ఘ స్వాతంత్ర్య సమరంలో
అసువులు బాసిన మహనీయులు ఎందరో

బెంగాల్ లో మంగల్ పాండే పూరించిన
మొదటి జాతీయవాద విప్లవ శంఖారావం

మీరట్ లో మొదలైన సిపాయిల తిరుగుబాటు
రొమ్ము విరిచి తెల్లవాడి నెదిరించి

వీర మరణం చెందిన లక్ష్మీబాయి కదనరంగం
'స్వరాజ్యం నా జన్మ హక్కు' అనే నినాదంతో

విప్లవానికి ఊపిచ్చిన బాల గంగాధర్ తిలక్
'అతివాదులు' కొందరు, 'మితవాదులు' కొందరు

ఆత్మ సమర్పణ చేసిన విప్లవకారులు మరికొందరు
భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్

సైనికబలంతో, విదేశాల మద్దతుతో
స్వాతంత్ర్యం సాధించాలని 'ఆజాద్ హింద్ ఫౌజ్'

స్థాపించిన సాహస ధీరుడు సుభాష్ చంద్ర బోస్
ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు

2. స్వాతంత్ర్య సమర సంధ్య

స్వాతంత్ర్య సమర సంధ్యా సమయంలో
అసువులు బాసిన అమరు లెందరో

స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలంతా ఒక్కటిగా
కుల మతాల సరిహద్దులు చెరిపేసి

దేశమంతా ఒక్కటయ్యి చేయి చేయి కలిపిపట్టి
వందేమాతరం నినాదంతో సత్యాగ్రహ సమరంతో

సహాయం నిరాకరణతో సైనిక తిరుగుబాటుతో
సంసారాలు వదిలిపెట్టి ప్రాణాలను కుదువ పెట్టి

తెల్లవాడి గుండె లదరగొట్టి బలిదానం చేసినట్టి
మహాత్ములు ఎందరో అందరికీ వందనాలు

వారి దారులు వేరైనా వారందరి గమ్యం ఒక్కటే
స్వాతంత్ర్యం సాధించి బంధవిముక్తులను చేయడమే

స్వరాజ్యం సాధించాలంటే ఉద్యమంలో
ఉండాలి సామాన్యుల భాగస్వామ్యమని

ఒక క్రొత్త మలుపు తెచ్చి వేషబాషలు మార్చి
దేశమంతా తిరిగి అందరితో కలిసి మెలిసి

అహింస, సత్యాగ్రహం అనే క్రొత్తరకం ఆయుధాలతో
సరిక్రొత్త ప్రణాళిక చేసిన గాంధీ మహాత్ముడు

సహాయ నిరాకరణ, శాసనోల్లంఘున,
క్విట్ ఇండియా, స్వయం పరిపాలన ఉద్యమాలతో

దేశమంతా ఊపందుకున్న ప్రజా ప్రభంజనం
ఎందరో మహానుభావుల ఆత్మత్యాగ ఫలితం

తల వంచిన తెల్ల దొరల ప్రభుత్వం
ఉదయించిన స్వతంత్ర భారత దేశం

3. స్వపరిపాలనకు నాంది

గాంధీ మహాత్ముని అహింసావాదం నెగ్గింది
స్వాతంత్ర్యం వచ్చింది స్వపరిపాలన తెచ్చింది

పగ్గాలు పట్టిన ప్రధమ ప్రధాని నెహ్రూజీ
పునాది వేసాడు స్వపరిపాలనకు ప్రభుత్వరంగ సంస్థలకు

'ఉక్కుమనిషి' సర్దార్ పటేలు ఉక్కుపాదంతో
దేశంలో ముళ్ళన్నీ వేరేసి దేశమంతా ఒక్కటి చేసె

అంబేద్కర్ నాయకత్వంలో మన రాజ్యాంగం తయారయ్యి
'భారత ప్రజాస్వామ్య గణతంత్రంగా' అవతరించెను మనదేశం

మేము పోతే ఈదేశం ముక్కలు చెక్కలు అవుతుందన్న
తెల్లవాడి మాటలన్ని వమ్ము చేసిన మొదటిశ్రేణి పౌరులు

నవ సమాజ నిర్మాతలు నవ భారత నాయకులు
అభివృద్ధికి పునాదు లేసిన నిరాడంబరులు

***

ప్రజాస్వామ్యం

తెల్లవాడి పరాయి పాలనలో బానిసత్వ రాజ్యంలో
సంపద తరలి పోయింది సంపాదన మాయమైంది

స్వపరిపాలన మొదలై పరిశ్రమలు వచ్చాయి
చేతికి పని దొరికింది సంపదలు సౌఖ్యాలు పెరిగాయి

మనిషికి స్వార్థం మొదలైంది దురాశకు దారి తీసింది
రాజకీయ రణరంగం ప్రజల మధ్యకు వచ్చింది

కుల మత ప్రాంత విభేదాలు పెంచుకుంటూ వచ్చింది
జాతీయ భావం కనుమరుగవుతూ వచ్చింది

దోపిడీలు మొదలయ్యి దౌర్జన్యాలు పెరిగాయి
ప్రజల సంపద కొల్లగొట్టి కొద్ది మంది కాజేసి

కర్షక కార్మిక శ్రమజీవుల శ్రమనంతను దోచేసి
బీదరికం పంచిపెట్టి తారతమ్యాలు పెంచారు

సమాజంలో స్వార్థపరులు సంఘద్రోహులు
ఏ ఎండకు ఆ గొడుగుపట్టే చీడపురుగులు

పదవిలో ఉన్నవాడిని పొగుడుతానే ఉంటాం
పదవి పోయాక వాడిని తిడుతూనే ఉంటాం

పదవిలో ఉన్నవాడు సమస్యలు పరిష్కరించడు
కష్టాలకు కారణం నా ముందువాడు అంటాడు

గత పాలన ఫలితాలను తన కాతాలో వేసుకొని
పదవిలో కొనసాగుతూ కాలం గడుపుతూంటాడు

నువ్వేమి చేస్తున్నావని ఎప్పుడూ అడగం
ఆలోచించం లోతుగా ఏవిషయం

అందుకే మనం బుర్ర లేని గొర్రెలం
ప్రజాస్వామ్యంలో ఇలాంటి లక్షణం

ప్రజలకు ఎన్నటికీ కాదు గర్వకారణం
ఎన్నికల తరువాత రాజకీయం మరిచిపోయి

ప్రభుత్వం ప్రతిపక్షం తమ విధులను నెరవేర్చితే
ప్రభుత్వం చేసే మంచి పనులు మెచ్చుకొని

చెడును నిలదీసే ప్రజలుంటే
అదేకదా నిజమైన ప్రజాస్వామ్యం

***

నీతిమంతులు

పైవాడి కాళ్ళు పట్టి
క్రిందివాడి జుత్తు పట్టి
ప్రక్కవాడి వెన్ను పొడిచి
పదవుల్లో పైకెదిగి
పనిచేయకుండా జీతం
నీతులు చెప్తూ లంచం
ఆకాశమే వీరికి హద్దుగా
భూమి మీద నిలబడరుగా
వెన్న మెత్తగా పూస్తారు
పదవిలో ఉన్నతి సాధిస్తారు
ఉద్యోగంలో ఉన్నప్పుడు పని చెయ్యరు
పదవీవిరమణ తర్వాత పాఠాలు చెప్తారు
స్వార్థం నిండిన ఈ మానవులు
సమాజానికి పట్టిన చీడపురుగులు
దేశ సంపద దోచే దొంగలు
దేశ పురోగతికి పెద్ద అడ్డంకులు

*** **శుభం** **

శ్రీ కందుల నాగేశ్వరరావు విశాఖపట్నం జిల్లా, సర్వసిద్ధి రాయవరంలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో Applied Physics లో MSc (Tech) చేశారు. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థలో (DRDO) శాస్త్రవేత్తగా పనిచేసి పదవీ విరమణ చేసారు. హైదరాబాద్ లో విశ్రాంత జీవితం గడుపుతూ రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు.

వందకు పైగా కవితలు రాసి ఫేస్బుక్, వాట్సప్ సముదాయాల్లో పోస్ట్ చేశారు. వాటిని 'నా మదిలో మెరిసిన హరివిల్లు' అనే పుస్తక రూపంలో ప్రచురించారు. భాగవత గ్రంథం నుండి శ్రీహరి అవతార వర్ణనలు, ధర్మసూత్రాలు ఆధారంగా 'భాగవత సూక్తులు' అనే శీర్షికతో నిర్విఘ్నంగా 444 రోజులు పోస్ట్ చేశారు. "గో తెలుగు.కామ్" అంతర్జాల పత్రికలో 'భాగవత కథలు' శీర్షికతో 30 కథలు ప్రచురించారు. వీటిని "హరిభక్తి సుధామృతం" , "హరిభక్తి కథామృతం" అనే పుస్తకాలుగా ప్రచురణకు సిద్ధం చేసారు.

'ఇవి కాక కొన్ని వ్యాసాలు, సాంఘిక కథలు కూడా గో తెలుగు.కామ్ అంతర్జాల పత్రికలో ప్రచురించారు. ప్రస్తుతం 'పురాణ గాథలు' శీర్షికతో అంతర్జాల పత్రికలో పౌరాణిక కథలు ప్రచురిస్తున్నారు.